www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక








ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 191 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | ఆదివారం -11 - అక్టోంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




2లో

## జగన్‌కు ఈడీ షాక్..
## అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ

## 13న విజయవాడకు రానున్న
# తమిళనాడు సీఎం విజయ్..
### సీఎం చంద్రబాబుతో కృష్ణా జలాల వాటాపై కీలక చర్చలు

- తెలుగు గంగ ఒప్పందం ప్రకారం నీరు రావడం లేదని తమిళనాడు ఆందోళన
- ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌లపైనా చర్చించనున్న సీఎం విజయ్
- పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ భేటీ అయ్యే అవకాశం



అమరావతి: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల సరఫరాలో ఏర్పడిన లోటు, ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన మిగతా 2 లో

## వేలంలో ప్రధాని మోదీ జ్ఞాపికలు.. జాబితాలో ఏపీకి చెందిన 18 బహుమతులు



2లో

- వేలం ద్వారా వచ్చిన నిధులను 'నమామి గంగే' కార్యక్రమానికి వినియోగం
- వేలం జాబితాలో కొండపల్లి బొమ్మ, కలంకారీ వస్త్రం వంటివి
- అందుబాటులో కాకతీయ కళాతోరణం వంటి ఖరీదైన జ్ఞాపికలు
- అక్టోబరు 31 వరకు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేసే అవకాశం

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వివిధ పర్యటనల సందర్భంగా అందుకున్న బహుమతులు, జ్ఞాపికలను కేంద్ర ప్రభుత్వం మరోసారి వేలానికి ఉంచింది. ఈసారి వేలంలో ఏపీకి చెందిన

## బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు మోసం చేశారు: వైఎస్ జగన్



2లో

- స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ముఖ్యమంత్రి బీసీలకు క్షమాపణ చెప్పాలన్న జగన్
- చంద్రబాబును 'మిస్టర్ 420' అంటూ జగన్ అభివర్ణన
- సూపర్ సిక్స్, విద్యా దీవెన హామీలపైనా విమర్శలు



2లో

## కరవుపై 12న మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

- ఈ నెల 12న ఉన్నతస్థాయి సమావేశం
- ఎల్ నినో ప్రభావంతో 17శాతం తగ్గిన వర్షపాతం
- రాష్ట్రంలోని 320 మండలాల్లో తీవ్ర కరవు ప్రభావం
- కేంద్రం నుంచి రూ.20,000 కోట్ల ప్యాకేజీ కోరిన రాష్ట్ర ప్రభుత్వం



2లో

## సీఈసీ వివాదం: ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

## ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా
# పలువురు మాజీ సీఎంల అరెస్ట్
### ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం



ఢిల్లీ: రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మిగతా 2 లో

## 'ఓట్ల దొంగతనం'పై రాష్ట్రపతి ఆధారం అడిగారా?..
## రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్!

- రాష్ట్రపతితో భేటీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఎన్డీఏ ఆగ్రహం
- రాష్ట్రపతితో సంభాషణను బయటపెట్టడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం
- సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విపక్షాలపై విమర్శలు
- సర్ ప్రక్రియపై 'ఇండియా' కూటమి ఆందోళన



ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి' (ఎన్డీఏ) తీవ్రంగా స్పందించింది. మిగతా 2 లో



2లో

## పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

- ఐటీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు
- ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి
- ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్..
# భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన
### భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి

- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి



హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. మిగతా 2 లో

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి



2లో

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు.

# సంపాదకీయం

## సహజీవన రాగం సాధ్యమా?

ఆర్థిక రంగం మొదలు కృత్రిమ మేధ (ఏఐ) వరకూ అన్నిటా పరస్పరం హోరాహోరీ తలపడుతున్న బలమైన ప్రత్యర్థులు అమెరికా, చైనాలు నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి కరచాలనం చేసుకున్నాయి. మొన్న మేలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ చైనాలో పర్యటించగా... మూడు రోజుల దౌత్య పర్యటన కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం వాషింగ్టన్ వచ్చారు. ఆయనకు రెండురోజులూ ఘనసత్కారాలే దక్కాయి. కెమెరాల ఎదుట అధినేతలిద్దరూ చిరునవ్వులు చిందించడం కూడా మామూలుగానే ఉంది. కానీ రెండు దేశాల మధ్యా ఉన్న సమస్యలు గానీ, వాటి కారణంగా ఇప్పటికే పేరుకు పోయిన విభేదాలు గానీ చిన్నవేం కావు. అవి సంక్లిష్టమైనవి, సామరస్య పరిష్కారానికి ఓపట్టాన లొంగనివి. 60వ దశకంలో నాటి రష్యా అధినేత నికితా క్రుశ్చేవ్ ప్రతిపాదించిన 'మూడు శాంతుల' ప్రతిపాదనల్లో ఒకటైన 'శాంతియుత సహజీవనం' సూత్రాన్ని గుర్తుకు తెచ్చేలా సంఘర్షణకన్నా సహకారమే ఇద్దరికీ లాభదాయకమని షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అప్పట్లో క్రుశ్చేవ్‌కు రాని జిన్‌పింగ్‌కు కూడా ట్రంప్‌నుంచి అనుకూల స్పందనేమీ రాలేదు. కానీ ఇరుపక్షాలూ మరింత సమతూక వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి కలిసి పనిచేస్తున్నాయని ట్రంప్ అన్నారు. ఎగుమతులు పెంచటానికి, ఆర్థికాభివృద్ధి సాధించటానికీ చైనా ప్రభుత్వం అక్కడి తయారీ రంగ పరిశ్రమలకు భారీయెత్తున సబ్సిడీలిస్తోంది. దాంతో చవగ్గా కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఖనిజాలు, ఉక్కు, ఇతర రకాల సరుకులు పాశ్చాత్య మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ ప్రవాహం అమెరికాను, పాశ్చాత్య దేశాలను తీవ్రంగా దెబ్బ తీస్తోంది. దీన్ని తగ్గించేందుకు తొలి విడతలోనే ట్రంప్ చేసిన ప్రయత్నాలు కొంత వరకూ ఫలితాన్నిచ్చాయి. నిరుడు దీన్ని మరింత నియంత్రించేందుకు 25 శాతం సుంకాలు విధించారు. వాటి కారణంగా సరుకుల వరద తగ్గిన మాట వాస్తవమే అయినా, దాదాపు 40 పాశ్చాత్య దేశాల మీదుగా ఆ వస్తువులు వెల్లువెత్తటం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగానే చైనా ఇదంతా చేస్తోంది.

ఎవరెంతగా మొత్తుకుంటున్నా విదేశాలతో నిరుడు చైనా వాణిజ్య మిగులు లక్ష కోట్ల డాలర్ల పైమాటే. ఈమధ్యే అమెరికా మాజీ ఆర్థికమంత్రి జానెట్ ఎలెన్ అంతంతమాత్రంగా ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం 'చైనా షాక్'తో మరింత కుంగటం ఖాయమని చేసిన హెచ్చరిక వర్తమాన స్థితికి అద్దం పడుతోంది. చైనా సరుకులపై వ్యామోహంతగ్గించుకోమంటూ జనానికి చేసే హితబోధలేమీ పనిచేయటం లేదు. 'మాగా' పేరు చెప్పి ఆవేశంతో ఊగిపోయేవారు సైతం ఈ విషయంలో ట్రంప్ మాటల్ని బేఖాతరు చేస్తున్నారు. దాంతో దిక్కుతోచని స్థితిలో చైనాపై గత నెలలో 12.5 శాతం అదనపు సుంకాలు విధించారు. కానీ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుకోవాల్సిన అవసరాన్ని కుదిరాక గత నెలలో కొన్ని వస్తువులకు దీన్నుంచి మినహాయింపునిచ్చారు. నవంబర్‌తో ముగియాల్సిన ఆ వెసులుబాటును తాజాగా వచ్చే జనవరి 10 వరకూ పొడిగించారు.

అమెరికాతో సంఘర్షణ ముదిరితే జరిగే పర్యవసానాలేమిటో చైనాకు తెలియంది కాదు. అందుకే అది ద్విముఖ వ్యూహం అనుసరిస్తోంది. సుంకాలవల్ల అమెరికాలో కోల్పోయే నష్టాన్ని యూరోప్ దేశాల్లో భర్తీచేసుకుంటోంది. అలాగే తమవల్ల నష్టపోయే దేశాల్లో పరిశ్రమలు స్థాపిస్తామని, పెట్టుబడులు పెడతామని ప్రతిపాదిస్తోంది. ఆ దేశాల్లో భారీయెత్తున ఉద్యోగావకాశాలొస్తాయని ఊరిస్తోంది. ఈ వంకనే [illegible] ఈ విషయమై చైనాతో ఈయూ వచ్చేనెలలో చర్చించబోతోంది. కాని ఫలితం ఉంటుందన్న ఆశ మాత్రం లేదు. అమెరికా--చైనా ఘర్షణలు ముదిరితే బాగుండు నని అవి కోరుకుంటున్నాయి. ఆ మాటెలా వున్నా ట్రంప్, జిన్‌పింగ్‌లిద్దరూ చైనాలోనవంబర్‌లో జరిగే ఆసియా పసిఫిక్ ఎకనామిక్ ఫోరం, డిసెంబర్‌లో అమెరికాలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా కలుసుకోబోతున్నారు. అప్పటికల్లా వాణిజ్య సమస్య ఉపశమించాలని రెండు దేశాలకూ కోరికైతే ఉంది. కానీ పరస్పర విరుద్ధ శక్తుల మధ్య అదంత సులభం కాదని చరిత్ర చెబుతోంది.

## కరవుపై 12న మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్: తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, దాని పర్యవసానాలపై ఆయన సమీక్ష జరపనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా వర్షాభావ ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై లోతుగా చర్చిస్తారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 6 నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాల్లో తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాల్లో దాదాపు సగం మండలాలు కరవు ప్రభావానికి గురైనట్లు అధికారిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. తక్షణ సహాయం కింద రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేపడుతున్న చర్యలు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు, నిపుణుల నుంచి సలహాలు స్వీకరించడం వంటి అంశాలు కూడా ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన 12 ప్రామాణిక అంశాల ఆధారంగా అక్టోబర్ చివరి నాటికి సమగ్ర కరవు నివేదికను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

### పట్టిసీమ ఫలం.. సీఎం చంద్రబాబుకు
## కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

అమరావతి: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## విజయవాడలో టెన్షన్..
## షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు ఈరోజు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

### ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా
## పలువురు మాజీ సీఎంల అరెస్ట్

ఢిల్లీ: రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

హైదరాబాద్: తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

### జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై
## హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## 13న విజయవాడకు రానున్న
## తమిళనాడు సీఎం విజయ్.. కారణమిదే!

అమరావతి: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల సరఫరాలో ఏర్పడిన లోటు, ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డ్యామ్‌లు, నదుల అనుసంధానం వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు రానున్నాయి. తెలుగు గంగ ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఏటా 12 టీఎంసీల కృష్ణా జలాలను తమిళనాడుకు రాష్ట్ర సరిహద్దు వద్ద అందించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందింది. ఒప్పందం ప్రకారం రావాల్సిన నీటికి, ఇప్పటివరకు అందిన నీటికి మధ్య 9.749 టీఎంసీల భారీ వ్యత్యాసం ఉంది. ఈ నీటి కొరత అంశమే ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది. ఈ ఏడాదిలో మిగిలిన కాలానికి తమిళనాడు నీటి అవసరాలను సమీక్షించి, సరఫరాను గాడిన పెట్టేందుకు ఈ సమావేశం ఒక అవకాశంగా నిలవనుంది. కృష్ణా జలాల వాటాతో పాటు తమిళనాడులోకి ప్రవహించే నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్యామ్‌లు నిర్మించేందుకు చేస్తున్న కసరత్తుపై కూడా సీఎం విజయ్ తన ఆందోళనలను చంద్రబాబు దృష్టికి తీసుకురానున్నారు. ఈ డ్యామ్‌ల నిర్మాణం వల్ల దిగువ రాష్ట్రమైన తమకు నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని తమిళనాడు భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత డ్యామ్‌ల అంశం కూడా చర్చల ఎజెండాలో కీలకంగా ఉండనుంది. దీంతో పాటు నదుల అనుసంధానంపై కూడా ఇరు రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం విజయ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర మంత్రులతో కూడా సమావేశం కానున్నారని సమాచారం. ఇరు రాష్ట్రాల రాజకీయ నాయకత్వాల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యలకు ఒక పరిష్కారం కనుగొనాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం తర్వాత వెలువడే నిర్ణయాలు రెండు రాష్ట్రాల మధ్య జల సంబంధాలపై స్పష్టతనిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సీఈసీ వివాదం: ప్రతిపక్షాల
## తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

ఢిల్లీ: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. "రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

### 'ఓట్ల దొంగతనం'పై రాష్ట్రపతి ఆధారం అడిగారా?..
## రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్!

ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి' (ఎన్డీఏ) తీవ్రంగా స్పందించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగిన భేటీ వివరాలను రాహుల్ గాంధీ వెల్లడించిన తీరుపై ఎన్డీఏ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యల వాస్తవికతను వారు ప్రశ్నించారు. శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ప్రతినిధి బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయిన విషయం తెలిసిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకంలో అవకతవకలు జరిగాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు. భేటీ అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఓట్ల దొంగతనం' (ఓట్ చోరీ) ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి తమను కోరినట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ఎన్డీఏ మండిపడింది. బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ మాట్లాడుతూ, దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తితో జరిగిన సంభాషణ వివరాలను బహిరంగంగా వెల్లడించడం ఎంతవరకు సబబు? అని ప్రశ్నించారు. "రాష్ట్రపతితో ఏం చర్చించారో బయటపెట్టడం రాజ్యాంగ పదవి గౌరవానికి సంబంధించిన ఆందోళనలను రేకెత్తిస్తుంది. రాహుల్ గాంధీ చెబుతున్నవి అబద్ధం కూడా కావచ్చు. ప్రతిపక్ష నేతగా రాష్ట్రపతిని కలిసే హక్కు ఆయనకు ఉంది, కానీ ఆమె ఏం చెప్పారో వ్యాఖ్యానించే హక్కు లేదు" అని రూడీ అన్నారు. బిహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ సరౌగి కూడా విపక్షాల ఆరోపణలను తప్పుబట్టారు. "రాష్ట్రపతిని కలవడం రాజ్యాంగ హక్కే, కానీ మీరు ఏమైనా సాక్ష్యాలు సమర్పించారా? ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఈ ప్రక్రియకు 150 రోజులు పడుతుంది. అభ్యంతరాల కోసం నెల రోజుల సమయం ఇస్తారు. దేశవ్యాప్తంగా 20 లక్షల పేర్లను తొలగించారు" అని ఆయన ప్రక్రియను వివరించారు. జేడీయూ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ప్రతి పార్టీకి ఉంటుందని, అయితే విపక్షాలు తమ రాజకీయ వైఖరి, ప్రజలతో ఉన్న సంబంధంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతినిధి బృందంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై విపక్షాలు కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వేలంలో ప్రధాని మోదీ జ్ఞాపికలు..
## జాబితాలో ఏపీకి చెందిన 18 బహుమతులు

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వివిధ పర్యటనల సందర్భంగా అందుకున్న బహుమతులు, జ్ఞాపికలను కేంద్ర ప్రభుత్వం మరోసారి వేలానికి ఉంచింది. ఈసారి వేలంలో ఏపీకి చెందిన 18 ప్రత్యేక బహుమతులు కూడా ఉండటం విశేషం. ఈ వేలం ద్వారా సమీకరించిన నిధులను గంగానది ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'నమామి గంగే' కార్యక్రమానికి విరాళంగా ఇవ్వనున్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఈ ఈ-వేలం ప్రక్రియను నిర్వహిస్తోంది. ప్రధాని మోదీ తన ఏపీ పర్యటనల సమయంలో పలువురు ప్రముఖులు, సంస్థల నుంచి ఎన్నో కానుకలు స్వీకరించారు. వాటిలో 18 బహుమతులను ప్రస్తుతం వేలంలో ఉంచారు. వీటిలో ప్రధాని ఫొటోతో రూపొందించిన ప్రత్యేకమైన కలంకారీ వస్త్రం, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం అందించిన జ్ఞాపిక, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే కళాఖండం, తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే కొండపల్లి ఎద్దులబండి బొమ్మ వంటివి ఉన్నాయి. ఈ బహుమతులను దక్కించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయవచ్చు. ఇది పీఎం మెమెంటోస్ 8వ విడత వేలం కాగా, ప్రజల నుంచి వస్తున్న స్పందన దృష్ట్యా గడువును అక్టోబరు 31 వరకు పొడిగించారు. ఈ వేలంలో దేశవిదేశాల నుంచి అందిన సుమారు 30 రకాల జ్ఞాపికలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి భారీ ధర పలుకుతోంది. తెలంగాణకు చెందిన కాకతీయ కళాతోరణం వెండి నమూనా ప్రాథమిక ధరను రూ.10 లక్షలుగా నిర్ణయించారు. అలాగే, జగన్నాథ పరివార రథం ప్రతిమ బేస్ ప్రైస్ రూ.21 లక్షలు కాగా, కర్ణాటకకు చెందిన శ్రీరాముడి వెండి విగ్రహానికి రూ.13.50 లక్షల ప్రాథమిక ధర ఉంది. వీటితో పాటు వివిధ ఆలయాలు, చారిత్రక ప్రదేశాల నమూనాలు, సంప్రదాయ చేతివృత్తుల కళారూపాలు, చిత్రాలు, పెయింటింగులు, విగ్రహాలు, శాలువాలు వంటి ఎన్నో అమూల్యమైన వస్తువులు ఈ వేలంలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ జూఎఎవఎవత్‌శిం.స్త్రశీజ.అఅ ద్వారా తమకు నచ్చిన వస్తువుపై బిడ్ వేసి దక్కించుకోవచ్చని సాంస్కృతిక శాఖ అధికారులు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు మోసం చేశారు: వైఎస్ జగన్

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దారుణంగా మోసం చేశారని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో చంద్రబాబు వైఖరి బహిర్గతమైందని విమర్శించారు. చంద్రబాబును 'మిస్టర్ 420'గా అభివర్ణించిన జగన్, ప్రతి వర్గాన్ని అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం ఆయనకు అలవాటేనని 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి బీసీలను ఆకట్టుకుని, ఇప్పుడు వారిని వంచించారని జగన్ ఆరోపించారు. ఈ మోసానికి గాను చంద్రబాబు వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలులో వైఫల్యం, గత ప్రభుత్వ సంక్షేమ పథకాల రద్దు, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి దాదాపు రూ. 9 వేల కోట్ల బకాయిలను నిలిపివేయడం వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. 143 హామీలతో కూడిన కూటమి మేనిఫెస్టో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద మోసమని ఆయన దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనను ఇది ఉల్లంఘిస్తోందని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు గత ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

### స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..
## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

హైదరాబాద్: తెలంగాణలోని ప్రకృతి అందాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఐటీ సంస్థల తోడ్పాటు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పలు ఐటీ కంపెనీల సీఈఓలు, ముఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజుతోపాటు అటవీ, పర్యాటకశాఖల ఉన్నధికారులు హాజరయ్యారు. వివిధ ఐటీ సంస్థల సీఈవోలు, ప్రముఖులు... రాజన్న(టీసీఎస్), కిరణ్ చెరుకూరి(హెచ్‌సీఎల్), చింతలపాటి శ్రీనిరాజు(ఐ ల్యాబ్స్), మమత మద్దిరెడ్డి(హెచ్ఎస్‌బీసీ), వినయ్ అగర్వాల్(టెక్ మహీంద్ర), రామ్‌కుమార్(జెన్‌ప్యాక్), చంద్రశేఖర్‌శర్మ(సీటీఆర్ఎల్ఎస్) తదితరులు పాల్గొన్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ... "తెలంగాణలో ఎకో, ఫారెస్ట్, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో ఐటీ సంస్థలు భాగస్వాములు కావాలి. ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి. ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి. ఫ్యూచర్‌సిటీలో ఐటీ సంస్థలు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

### ఇంటర్నెట్, సౌకర్యాల మెరుగుదల

అటవీ ప్రాంతాల్లో పర్యాటక సౌకర్యాల మెరుగుదల, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేయడం వంటి అంశాలపై ఐటీ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించింది. తెలంగాణలోని ఎకో టూరిజం ప్రాజెక్టులు, ప్రకృతి అందాలు, పర్యాటక ఆకర్షణలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న అవకాశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఐటీ కంపెనీల ప్రతినిధులకు అటవీశాఖ వివరించింది. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్ కుమార్, సీసీఎఫ్‌లు శరవణన్, ప్రియాంక వర్గీస్, క్షితిజ, పర్యాటకశాఖ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పాల్గొన్నారు.

# ఘనంగా పరిగి పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి జన్మదిన వేడుకలు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి నివాసం వద్ద పరిగి మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బద్రి గారి రాజపుల్లారెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బద్రి గారి రాజ పుల్లారెడ్డి మరిన్ని ఉన్నత పదవులను కొనసాగించాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అఖిల శ్రీనివాస్ గుప్తా, గడిసిగాపూర్ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ మహిపాల్, వార్డు సభ్యులు యాదయ్య, శ్రీనివాస్, రామ్ చరణ్, మాజీ ఉప సర్పంచ్ ప్రభు, బి ఎల్ ఎ లు శ్రీనివాస్, నాగరాజు, నాయకులు జైపాల్ రెడ్డి,నవాజ్, తదితరులు పాల్గొన్నారు.



# 8వ వార్డులో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం

## ప్రజల భద్రతే లక్ష్యం.. చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగిమున్సిపాలిటీలోని 8వ వార్డులో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల తో 8వ వార్డు కౌన్సిలర్ హబీబున్నీసా అయ్యూబ్ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టుకునే కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల వీధి కుక్కల దాడులతో చిన్నపిల్లలు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టారు. ముఖ్యంగా చిన్నారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్రజలకు భద్రత కల్పించేందుకు కార్యక్రమం చేపట్టడం జరిగిందని కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వద్దే అంజి ,వద్దే రాజు, కాశీఫ్, ముజమెల్, శంకర్, ఉమర్ వీరమని, తదితరులు పాల్గొన్నారు.

# డిటిసి లో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు

## – జిల్లా ఎస్పీ స్నేహమేహర



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పోలీస్ ఫ్లాగ్ డే--2026 సందర్భంగా డీటీసీలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీ నిర్వహణ వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు పోలీస్ ఫ్లాగ్ డే--2026 కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డిటిసి)లో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగింది. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిలో రచనా నైపుణ్యాలను, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడంతో పాటు పోలీస్ విధులు, బాధ్యతలు, ప్రజాసేవ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై మరింత అవగాహన పెంపొందించడమే ఈ పోటీ ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ 21న నిర్వహించనున్న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీస్ సిబ్బంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించడం, ప్రజల నుంచి గౌరవం మరియు విశ్వాసాన్ని పొందడం, క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి అంశాలపై తమ ఆలోచనలను వ్యాసాల రూపంలో వెల్లడించేలా ఈ పోటీలు నిర్వహించడం జరిగింది.. ఇటువంటి కార్యక్రమాలు పోలీస్ సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రేరణనిస్తాయి అని పోలీస్ అధికారులు తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో డిటిసి డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ ఐ శ్రీశైలం, ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.



# ఢిల్లీలో హైటెన్షన్.. రాహుల్ సంచలన హెచ్చరిక

ఢిల్లీ: 'మిస్టర్ మోదీ.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎంతమంది పోలీసులను తెచ్చుకుంటారో తెచ్చుకోండి. యువకులందరినీ, నేతలందరినీ అరెస్ట్ చేసుకోండి. మేం మాత్రం వెనక్కి తగ్గం.. మిమ్మల్ని కమ్మేస్తాం" అంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. "మేం రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం. 15 ఏళ్లలో దేశానికి ఏం జరిగిందో.. అది మళ్లీ జరగనివ్వం. రాజ్యాంగంపై దాడి చేసిన పాలకులను దించి తీరుతాం. దేశ యువతను చూసి గర్వపడుతున్నా. యువత తమ పోరాటాన్ని ఆపొద్దు.. మీ వెనుక మేం ఉన్నాం" అంటూ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. కాగా, ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. కనాట్ ప్లేస్‌లో సీజేపీ కార్యకర్తల ఆందోళన కొనసాగుతోంది. గుంపులుగా వస్తున్న నిరసనకారులు ఆందోళనలో పాల్గొంటున్నారు. జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# రాహుల్, విజయ్ భేటీ.. గంటపాటు చర్చలు



చెన్నై: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, తమిళనాడు సీఎం విజయ్ శనివారం చెన్నైలో సమావేశమయ్యారు. విజయ్ నివాసంలోనే ఇద్దరు నేతలు సుమారు గంటపాటు చర్చలు జరిపారు. అనంతరం సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ, తిరమిసు, కుకీస్‌ను రుచి చూశారు. దీంతో ఈ భేటీ రాజకీయ వర్గాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ ఆసక్తికరంగా మారింది. చెన్నైలోని నీలాంకరైలో ఉన్న తన నివాసం వద్దకు వచ్చిన రాహుల్ గాంధీకి విజయ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారు. ఆ తర్వాత కేఫ్‌కు వెళ్లిన నేతలు అక్కడికి వచ్చిన అభిమానులతో ముచ్చటించారు. అనంతరం కొందరితో సెల్ఫీలు దిగారు. రాహుల్ గాంధీ చెన్నైలో నిర్వహిస్తున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో జరగనున్న యువజన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి లక్ష మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం హంగ్ పరిస్థితులు ఏర్పడటంతో కాంగ్రెస్, టీవీకే చేతులు కలిపిన విషయం తెలిసిందే. గతంలో డీఎంకేతో కలిసి ఉన్న కాంగ్రెస్.. విజయ్ పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జరిగిన రాహుల్, విజయ్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారిక చర్చలతో పాటు ఇద్దరి మధ్య కనిపించిన స్నేహపూర్వక వాతావరణం కూడా అందరి దృష్టిని ఆకర్షించింది.ు

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా మాట్లాడుతున్న



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పోలీస్ ఫ్లాగ్ డే--2026 సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, శూూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 21 అక్టోబర్ పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని అక్టోబర్ నెలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది చేస్తున్న త్యాగాలు, ప్రజల రక్షణ కోసం అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

### వ్యాసరచన పోటీలు:

12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల వినియోగం నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన మార్గాలు వంటి అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, "తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర" అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### షార్ట్ ఫిల్మ్ పోటీలు:

పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలపై తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్ల భాషల్లో గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించి పోటీల్లో పాల్గొనవచ్చని ఎస్పీ తెలిపారు. పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన వంటి అంశాలను ప్రతిబింబించేలా షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించాలని సూచించారు. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

### ఫోటోగ్రఫీ పోటీలు:

పోలీస్ శాఖ విధులు, సేవలు, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్--ప్రజల సంబంధాలు, విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వంటి అంశాలపై ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ పోటీలకు సమర్పించే ఫోటోలు ఇటీవల తీసినవై ఉండాలని, పోలీస్ శాఖ విధులకు సంబంధించినవై ఉండాలని మెమోలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఫోటోలను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన ఫోటోగ్రాఫర్లకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. వ్యాసరచన పోటీలను 2026 అక్టోబర్ 27వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి, సంబంధిత పోలీస్ పోర్టళ్లలో 2026 అక్టోబర్ 30వ తేదీలోగా అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున, జిల్లాలోని పోటీల్లో పాల్గొనే వారు తమ షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్ హెచ్ ఓ ఎస్) ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించాలని ఎస్పీ సూచించారు. విద్యార్థులు, యువత, ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారు, పోలీస్ సిబ్బంది ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించాలని, సమాజంలో అవగాహన పెంపొందించే సందేశాలను సృజనాత్మకంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, పిలుపునిచ్చారు.

# ఆలోచనశక్తికి ఏఐ వైరస్

అమరావతి: సైన్స్ ప్రాజెక్టా? కృత్రిమ మేధ సిద్ధంగా ఉంది. వ్యాసం రాయాలా? ఏఐ సెకన్లలో రాసిచ్చేస్తుంది. కోడింగ్ ఎర్రరా? టూల్ సరిచేస్తుంది. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం విద్యారంగాన్ని పరుగులు పెట్టించడం నిజమే అయినా.. దానికి సమాంతరంగా విద్యార్థుల స్వతంత్ర ఆలోచనశక్తికి గండికొడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చేతికి వచ్చిన సరికొత్త 'కాగ్నిటివ్ ఆఫ్--లోడింగ్' (మెదడు చేయాల్సిన ఆలోచనను మెషీన్‌కు అప్పగించే ధోరణి) యువతరాన్ని ఆలోచనశక్తి హీనులుగా మార్చేస్తోందంటున్నారు. ఇది భవిష్యత్ తరాలను వేగంగా ప్రమాదంలోకి నెడుతోందని ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న అధ్యయనాలు, సర్వేలు హెచ్చరిస్తున్నాయి. అంతర్జాతీయ విద్యాసంస్థలు, డిజిటల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ--సింగపూర్), చీగ్ గ్లోబల్ (యూఎస్ఏ) నివేదికల ప్రకారం ఉన్నతవిద్య విద్యార్థుల్లో జనరేటివ్ ఏఐ సాధనాల వినియోగం శరవేగంగా పెరిగింది. మనదేశంలోను ఇంజినీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 శాతం మంది విఫలమవడానికి కారణం ఏఐపై అధికంగా ఆధారపడడమేనని చెబుతున్నారు. మెదడును శ్రమపెట్టే విద్యార్థే భవిష్యత్తులో సాంకేతికతను నడిపిస్తాడని, లేదంటే సాంకేతికతే ఆ విద్యార్థిని నడిపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల ఏఐ వినియోగం

కొత్తగా అరచేతిలోకి వచ్చిన కృత్రిమ మేధ మనుషుల మేధస్సును తుస్సుమనిపిస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో తమ మెదడుకు పనిచెప్పకుండా, ఆలోచనకు పదును పెట్టకుండా సులభంగా పనిపూర్తయ్యే మార్గాల కోసం ఏఐని ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతున్నట్లు డీఈసీ సర్వేలో వెల్లడైంది. హోంవర్క్ చేసేందుకు, ప్రాజెక్టుల కోసం, అసైన్‌మెంట్లు, అనువాదాలు, పరీక్షల సన్నద్ధత, అకడమిక్ పేపర్ల ఎనాలసిస్.. ఇలా ఒకటేంటి అన్నింటికీ జనరేటివ్ ఏఐ సాధనాలపై ఆధారపడుతున్నట్టు గుర్తించారు. ఈ విధానం ఎక్కువగా, యూకే, లాటిన్ అమెరికా, భారత్, యూఎస్ఏ, యూరప్ దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరుసలో యునైటెడ్ కింగ్‌డమ్ 92--95 శాతంతో మొదటిస్థానంలో ఉండగా మనదేశం 86--89 శాతంతో మూడోస్థానంలో ఉంది. యూకేలో అసైన్‌మెంట్లు, రీసెర్చ్ సారాంశాలు, కాన్సెప్ట్ క్లారిటీ కోసం, బ్రెజిల్, మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాల్లో ప్రాజెక్టులు, అనువాదాలు, హోంవర్క్ కోసం ఏఐని వాడుతుండగా, భారతదేశంలో కోడింగ్ సమస్యలు, పరీక్షల సన్నద్ధత, ప్రాజెక్టుల కోసం, అమెరికాలో వ్యాసాలు, బ్రెయిన్ స్టార్టింగ్, క్విజ్ ప్రిపరేషన్ కోసం, ఫ్రాన్స్, జర్మనీ వంటి యూరప్ దేశాల్లో థీసిస్ రీసెర్చ్, అకడమిక్ పేపర్ల తయారీకి వాడుతున్నారు. శాతాల పరంగా బ్రిటన్ మొదటిస్థానంలో ఉన్నప్పటికీ.. సంఖ్యాపరంగా చూస్తే భారతదేశమే ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది. దేశంలో ఉన్న సుమారు 4.3




కోట్లమంది ఉన్నతవిద్య విద్యార్థుల్లో ఏకంగా 3.5 కోట్ల మందికిపైగా రోజూ లేదా వారానికి పలుమార్లు ఏఐని వాడుతున్నట్టు తేలింది. యూఎస్‌లో ఈ సంఖ్య 1.4 కోట్లు ఉండగా, యూకేలో సుమారు 20 లక్షల వద్ద ఉంది.

### ఆలోచన శూన్యం.. క్యాంపస్‌లలో వైఫల్యాలు:

జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థుల్లో స్వంతంగా శోధించి నేర్చుకునే సంస్కృతి తగ్గిపోతోందని సర్వేలు చెబుతున్నాయి. ఇది మానవ మేధస్సును నాశనం చేస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. విషయ పరిజ్ఞానం పెంచుకోకుండా కాపీ--పేస్ట్ సంస్కృతి విస్తరిస్తోందంటున్నారు. ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం ప్రతి పదిమంది విద్యార్థుల్లో ఆరుగురు (60 శాతం) ఏఐ ఇచ్చిన ఫలితాలను క్రాస్‌చెక్ చేయకుండా నేరుగా సబ్మిట్ చేస్తున్నారు. విద్యార్థులు స్వయంగా గ్రంథాలయాలు, పుస్తకాల్లో చదివి పరిశోధన చేసే సమయం గతంతో పోలిస్తే సుమారు 45 శాతం తగ్గింది. ' కాగ్నిటివ్ ఇంపాక్ట్ స్టడీస్ ప్రకారం.. నిరంతరం ఏఐ టూల్స్‌పై ఆధారపడే విద్యార్థుల్లో సమస్య పరిష్కార సామర్థ్యం, సమాచారాన్ని నిలుపుకొనే జ్ఞాపకశక్తి సాధారణ విద్యార్థుల కంటే 20--25% తగ్గుముఖం పడుతోంది. ' కార్పొరేట్ హెచ్ఆర్ సర్వేల ప్రకారం, దేశవ్యాప్తంగా క్యాంపస్ డ్రైవ్‌లలో పాల్గొనే భారతీయ ఐటీ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 40--50 శాతం మంది ముఖాముఖి ఇంటర్వ్యూలలో ప్రాథమిక లాజిక్, మాన్యువల్ కోడింగ్ రాయడంలో విఫలమవుతున్నారు. కాలేజీల్లో ఆటోమేటెడ్ కోడ్ జెనరేషన్ టూల్స్ వాడటం వల్ల, మొదటి నుంచి సొంతంగా లాజిక్ నిర్మించే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తోందని, దీంతో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూలలో తేలిపోతున్నారని చెబుతున్నారు. ' ఏఐ టూల్స్ కొన్నిసార్లు ఉనికిలో లేని తప్పుడు సమాచారాన్ని (ఏఐ హాలూసినేషన్) కూడా సరైనదేనన్నట్లు భ్రమింపజేస్తాయని, సర్వేల ప్రకారం 55 శాతం మంది విద్యార్థులు ఆ ఆధారాలను ధ్రువీకరించుకోకుండానే తమ ప్రాజెక్టుల్లో జోడిస్తున్నారని గుర్తించారు.

### భారత విద్యావ్యవస్థకు సవాళ్లు

యూకే, యూఎస్ వంటి దేశాల్లో ఏఐ అకాడమిక్ ఎథిక్స్, డిటెక్షన్ సాఫ్ట్‌వేర్ల వినియోగం ఇప్పటికే మొదలైంది. భారత్‌లో సీబీఎస్ఈ, యూజీసీ వంటి విద్యామండళ్లు మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తీవ్ర అంతరాలున్నాయి. విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్, అసైన్‌మెంట్లు నిమిషాల్లో పూర్తవుతుండటంతో అసలైన ప్రతిభను గుర్తించడం అధ్యాపకులకు పెద్ద సవాలుగా మారింది. దేశంలోని 80 శాతం విద్యాసంస్థల్లో సరైన ఏఐ--డిటెక్షన్ వ్యవస్థలు అందుబాటులో లేవు. పాశ్చాత్య దేశాల్లో విద్యార్థులు ఆలోచనలకు మెరుగులు దిద్దుకోవడానికి ఏఐని వాడితే, భారత్‌లో ఇంకా చాలామంది విద్యార్థులు శ్రమను తప్పించుకునే 'షార్ట్‌కట్'గా మాత్రమే చూస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని పరిష్కారమార్గాలను అనుసరిస్తే విద్యార్థిని 'మాస్టర్'గా నిలబెట్టవచ్చని పేర్కొంటున్నారు. ' ప్రాజెక్ట్ పేపర్లను మాత్రమే చూసి మార్కులు వేసే విధానానికి స్వస్తి పలకాలి. విద్యార్థి సమస్యను ఎలా పరిష్కరించాడు, ఏయే దశల్లో ఆలోచించాడు అనే దానిపై తరగతి గదిలో ప్రెజెంటేషన్లు, లైవ్ వైవా తప్పనిసరి చేయాలి. ' తరగతి గదిలోనే ఏఐని వాడటానికి అనుమతినిస్తూ.. ఆ టూల్ ఇచ్చిన సమాధానంలో ఉన్న తప్పులు, లోపాలు, హాలూసినేషన్లను గుర్తించమని (రివర్స్--లెర్నింగ్ ) విద్యార్థులకు టాస్?కలు ఇవ్వాలి. దీనివల్ల వారి విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్) మేల్కొంటుంది. ' వారానికి కనీసం 2--3 గంటలు ఎలాంటి డిజిటల్ పరికరాలు లేకుండా పెన్ను, పేపర్‌తో ఆలోచించడం, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించడాన్ని విద్యాసంస్థలు తప్పనిసరి చేయాలి. అలా అని సాంకేతికతను నిషేధించడం దీనికి పరిష్కారం కాదని.. అలాగే అది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదన్న వాస్తవాన్ని కూడా పాఠశాల దశలోనే తెలియజేయాలని చెబుతున్నారు. ఏఐని ఒక సహాయకుడిగా మాత్రమే చూడాలన్న స్పృహను విద్యార్థుల్లో కలిగించాలని సూచిస్తున్నారు.

# 'నోబెల్ శాంతి'కి సరైన ఎంపిక

నిరుడు మాదిరిగానే ఈసారి కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎంతగా అర్రులు చాచినా నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కలేదు. భారతీయ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవేత్త, మానవహక్కుల ఉద్యమకారిణి నవనీతం పిళ్లేను శాంతి పురస్కారానికి ఎంపిక చేశామని నోబెల్ కమిటీ శుక్రవారం చేసిన ప్రకటనను ప్రపంచవ్యాప్త మానవహక్కుల ప్రియులు హర్షించారు. కండబలం ఉన్నదనీ, ప్రపంచ దేశాలను దోచుకొచ్చి పోగేసిన అపార సంపద, ఆయుధ సంపత్తి సొంతమని విర్రవీగి బడుగు దేశాలపై దండెత్తే దుర్నీతి రాజ్యమేలుతున్న కాలంలో మానవహక్కుల కోసం నిలబడి హంతకుల్ని వేలెత్తి చూపగల చేవ, సాహసం ప్రదర్శించేవారు నిస్సందేహంగా మహోన్నతులు. నవనీతం ఆ కోవకు చెందిన అరుదైన మహిళ. గాజాలో మూడేళ్లుగా మారణహోమం సృష్టిస్తూ, వేలాదిమంది మరణానికి, లక్షలాదిమంది క్షతగాత్రులు కావటానికి కారణమైన ఇజ్రాయెల్ ముసుగు తొలగించిన ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్‌కు 2025లో ఆమె నేతృత్వం వహించారు. మహాకవి శ్రీశ్రీ 'కవితా... ఓ కవితా!' ఖండికలోని అపురూప ప్రయోగం 'అగ్ని సరస్సున వికసించిన వజ్రం' విశేషణానికి నవనీతం సరిగ్గా సరిపోతారు. తన బతుకంతా పోరాటమే ఊపిరిగా శ్వాసించిన ఆమె...బాల్యంలో దుర్భరదారిద్ర్యాన్ని చవి చూశారంటే... విద్యార్థినిగానే దక్షిణాఫ్రికా జాత్యహంకార ప్రభుత్వాన్ని ధిక్కరించారంటే చిన్న విషయం కాదు. 70వ దశకంలో భర్త గాబీ పిళ్లేతోసహా వందలమందిని అప్పటి పాలకులు ఉగ్రవాద చట్టం కింద నిర్బంధిస్తే వారి విడుదలకు చట్టబద్ధంగా పోరాడి ఆమె తొలి విజయాన్నందుకున్నారు. నాటల్‌లో 1967లో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన తొలి మహిళ ఆమెనే. అటుపై దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఎన్నో ప్రాముఖ్యతగల ట్రైబ్యునళ్లకు సారథ్యంవహించి అసహాయులకు స్వరమై నిలిచారు. మహిళలపై సాగే లైంగిక హింసను నరమేధంగా పరిగణించాలని 1998లో చరిత్రాత్మక తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఆమె ఉన్నారు. హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు 2003నుంచి అయిదేళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత సమితి మానవహక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు. ఇతర పురస్కారాల మాటెలావున్నా శాంతి బహుమతి ఎంపిక విషయంలో వ్యవహరించే తీరుపై ఎప్పటినుంచో ఫిర్యాదులున్నాయి. 1919లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్‌కూ, 1973లో అప్పటి అమెరికా విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్‌కూ, 2002లో మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కూ, 2009లో



ఒబామాకూ బహుమతులెలా ఇచ్చారో ఎవరికీ తెలియదు. నానాజాతి సమితిలో ప్రధాన పాత్ర పోషించినందుకు ఉడ్రో విల్సన్‌కు శాంతి బహుమతినిచ్చినా... అమెరికా ఆ సమితిలో చేరిందిలేదు. చిలీలో సైనిక కుట్రకు ప్రణాళిక రచించి, వియత్నాం యుద్ధాన్ని కొనసాగించి, కాంబోడియాపై బాంబులు కురిపించిన కిసింజర్‌కి ఇచ్చినప్పుడు ప్రపంచం నివ్వెరపోయింది. అఫ్గానిస్తాన్ ముజాహిదీన్లకు ఆయుధాలిచ్చి ఉగ్రవాదానికి బీజం వేసినవారు కార్టర్. శాంతి పురస్కారం ఇచ్చేనాటికి ఒబామా అధికారంలోకి వచ్చి ఎన్నాళ్లో కాలేదు. కనీసం అందుకైనా ఆయన శాంతి కోసం పాటుపడకపోగా, బుష్ మొదలెట్టిన యుద్ధాలను మరింత తీవ్రం చేశారు. 'అది ఎందుకిచ్చారో నాకే అర్థంకాలేద'ని అనంతరకాలంలో ఒబామా చెప్పారు. 'ఒబామాకున్న అర్హత ఆయన బుష్ కాకపోవటమే' అని చాలామంది అప్పట్లోనే ఎగతాళిగా అన్నారు. పిళ్లేకు పురస్కారం ఇవ్వటం ద్వారా నోబెల్ కమిటీ తన పాత పాపాలను కడిగేసుకుంది. ఆ బహుమతికి అర్రులుచాచిన ట్రంప్... విజేత నవనీతం రెండు విరుద్ధ భావజాలాలకూ, ఆచరణలకూ ప్రాతినిధ్యంవహిస్తారు. అంతర్జాతీయ వ్యవస్థల్ని ఖాతరుచేయని వ్యక్తి ట్రంప్ అయితే... వాటి వైశిష్ట్యాన్ని చాటినవారు పిళ్లే. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ట్రంప్ వ్యతిరేకిస్తే... నవనీతం దానికి సారథి. ఇజ్రాయెల్‌కు ట్రంప్ అండదండలందిస్తే... నవనీతం అందులోని హంతక స్వభావాన్ని బయటపెట్టారు. ట్రంప్‌ను నోబెల్‌కు సిఫార్సు చేసిన పాక్ తదితర దేశాలు 'ఆయన బలంద్వారా శాంతిని సాధించార'ని ప్రస్తుతిస్తే... నవనీతం జీవితమంతా బలహీనులకు స్వరమై నిలిచారు. మొత్తానికి నోబెల్ శాంతి కమిటీ ఈసారి తనను తాను గౌరవించుకుంది!

## సీపీఎం నేత గఫూర్ కుమారుడి మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: సీపీఎం నేత గఫూర్ కుమారుడు కిరణ్ మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఉన్నత విద్యను అభ్యసించి.. కాలిఫోర్నియాలో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తూ.. మంచి భవిష్యత్తు కలిగిన కిరణ్ అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. కన్నకొడుకును కోల్పోయిన ఎం.ఎ. అబ్దుల్ గఫూర్, పి. నిర్మల గార్ల దుఃఖం వర్ణనాతీతం. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి, కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలన్న వైఎస్ జగన్.. కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. కిరణ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## స్థానిక ఎన్నికలు.. ఎస్ఈసీ కీలక ప్రకటన



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఒక దశలోనే నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసిన సమయం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. నోటిఫికేషన్ వెలువడిన 14 రోజుల్లోనే పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఫలితాలు విడుదల కానున్నాయి. 15 రోజుల్లో పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు జరగనున్నాయి. రెండు రోజుల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. 16 రోజుల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రెండు రోజుల తర్వాత ఫలితాలు రానున్నాయి. పంచాయతీలకు మాత్రం పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 14 రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగియనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు నోటిఫికేషన్ నుంచి 15 రోజుల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 16 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పోలింగ్ పూర్తయిన రెండు రోజుల తరువాత వీటిలో ఓట్లు లెక్కించనున్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా.. మిగిలినవన్నీ పార్టీ పరంగా నిర్వహిస్తారు. నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్ ఏది ముందు వెలువడితే.. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఎన్నికలకు మొత్తం 1,05,432 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. తెలంగాణ నుంచి 17,650 బాక్సులు తెప్పించారు. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ ప్రకటించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్ఈసీ మీడియాతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లోనూ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు మెటీరియల్ సిద్ధం చేశాం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించాలన్న సూచనలు పరిశీలించి నిర్ణయాన్ని వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## "దేశాన్ని పార్లమెంటే పాలిస్తుంది, వీధులు కాదు".. కాంగ్రెస్, కాక్రోచ్‌లపై బీజేపీ ఫైర్..




న్యూఢిల్లీ,: ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఢిల్లీలో నిరసనలు చేపడుతున్న తరుణంలో బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. దేశంలో అరాచకాలను ప్రేరేపించే ప్రయత్నాలను ప్రజాస్వామ్యం అడ్డుకుందని బీజేపీ ఎంపీ, అధికార ప్రతినిధి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. "దేశాన్ని పార్లమెంట్ పాలిస్తుంది తప్పా వీధులు కాదు" అని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ఎప్పుడూ తలవంచలేదని, భవిష్యత్తులోనూ తలవంచేది లేదని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఆయన సమర్థించారు. గత మూడు రోజులుగా, శనివారం చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. భారత ప్రజాస్వామ్యం అరచకాలను ప్రేరేపించే ప్రయత్నాలను అడ్డుకుందని, దేశాన్ని పార్లమెంటే పాలిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలు జరుగుతున్న సమయంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ గెలిచిన విషయాన్ని రవిశంకర్ ప్రస్తావించారు. ఢిల్లీలో ఆందోళనలు జరుగుతున్న సమయంలోనే ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రతిపక్షాల ఆందోళనల్ని "అరాచక ఉద్యమం"గా అభివర్ణించారు. "తాము నిరసనలకు వ్యతిరేకం కాదని, కానీ ఎన్నికల్లో ఓటముల కారణంగా మీరు వీధి పోరాటాను ఆయుధంగా మార్చుకున్నారు" అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు.ι

## తెలంగాణలో 1.20 లక్షల మందికి ముద్రా లోన్స్.. రూ.2,800 కోట్లకు పైగా మంజూరు!

న్యూఢిల్లీ,: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం తెలంగాణలో చిన్న వ్యాపారాలు నిర్వహించే వారికి, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తన ట్వీట్ ద్వారా వెల్లడించారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందడం ద్వారా చిన్న పరిశ్రమలను ప్రారంభించడంతో పాటు, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించుకునే అవకాశం కలుగుతోంది. 2026 జూన్ 30 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, తెలంగాణలో 1,20,000కు పైగా ముద్రా రుణ ఖాతాల ద్వారా రూ.2,800 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. ముద్రా పథకం కింద అర్హులైన సూక్ష్మ వ్యాపారవేత్తలకు తాకట్టు లేకుండా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. వ్యాపార అవసరాలు, అభివృద్ధి స్థాయిని బట్టి రుణాలను వివిధ కేటగిరీలుగా విభజించారు. దీంతో చిన్న స్థాయిలో వ్యాపారం ప్రారంభించేవారి నుంచి ఇప్పటికే వ్యాపారాన్ని నిర్వహిస్తూ మరింత విస్తరించాలనుకునే వారి వరకు ఈ పథకం ఉపయోగపడుతుంది. దుకాణాలు, చిన్న తయారీ యూనిట్లు, సేవా రంగ వ్యాపారాలు వంటి అర్హమైన కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక సహాయం పొందవచ్చు. మహిళా సాధికారతకు కూడా ఈ పథకం ప్రాధాన్యం ఇస్తోంది. తెలంగాణలో 45,000 మందికి పైగా మహిళా లబ్ధిదారులకు రూ.508.13 కోట్ల రుణాలు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మహిళలు స్వయంగా వ్యాపారాలు ప్రారంభించడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవడానికి ఇలాంటి రుణాలు తోడ్పడతాయి. అయితే, రుణం మంజూరు కావడం అనేది వ్యాపార విజయానికి హామీ కాదు. వ్యాపార ప్రణాళిక, ఖర్చుల నిర్వహణ, మార్కెట్ డిమాండ్ కూడా కీలకమే. ప్రధానమంత్రి ముద్రా యోజనలో నాలుగు రకాల రుణ కేటగిరీలు ఉన్నాయి. శిశు కేటగిరీలో రూ.50,000 వరకు రుణాలు అందిస్తారు. కొత్తగా చిన్న వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ కేటగిరీ ఉపయోగపడుతుంది. తెలంగాణలో ఈ విభాగంలో 41,000కు పైగా ఖాతాల ద్వారా రూ.183.64 కోట్లు మంజూరయ్యాయి. తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలనుకునేవారికి అవసరమైన ప్రారంభ మూలధనాన్ని సమకూర్చుకోవడంలో ఇది సహాయపడుతుంది. కిశోర్ కేటగిరీలో రూ.50,000 కంటే ఎక్కువ నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్నవారు దాన్ని విస్తరించడానికి, కొత్త పరికరాలు కొనుగోలు చేయడానికి లేదా రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకోవడానికి ఈ రుణాలు ఉపయోగపడతాయి. తెలంగాణలో ఈ విభాగంలో 65,000కు పైగా ఖాతాల ద్వారా రూ.1,112.81 కోట్లు మంజూరయ్యాయి. తరుణ్ కేటగిరీ కింద రూ.5 లక్షలకు మించి రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తారు. వ్యాపారాన్ని మరింత పెద్ద స్థాయికి తీసుకెళ్లాలనుకునే అర్హులైన వ్యాపారవేత్తలకు ఇది ఉపయోగపడుతుంది. తెలంగాణలో ఈ కేటగిరీలో 14,000కు పైగా ఖాతాల ద్వారా రూ.1,218.65 కోట్లు మంజూరయ్యాయి. ఇక తరుణ్ ప్లస్ కేటగిరీ కింద రూ.10 లక్షలకు మించి రూ.20 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. గతంలో తరుణ్ కేటగిరీ కింద రుణం తీసుకుని, దాన్ని విజయవంతంగా తిరిగి చెల్లించిన అర్హులైన వ్యాపారవేత్తలకు ఈ సదుపాయం వర్తిస్తుంది. తెలంగాణలో ఈ విభాగంలో 2,000కు పైగా ఖాతాల ద్వారా రూ.379.29 కోట్లు మంజూరయ్యాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , పంజాబ్ నేషనల్ బ్యాంక్ (గ్రాచీదీ), బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ సహా పలు బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు తమ వ్యాపార అవసరాలకు అనుగుణంగా సంబంధిత బ్యాంకును సంప్రదించి అర్హతలు, వడ్డీ రేట్లు, తిరిగి చెల్లింపు నిబంధనలు తెలుసుకోవాలి. మొత్తంగా, ముద్రా పథకం చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా స్వయం ఉపాధి, వ్యాపార విస్తరణ, ఉపాధి కల్పనకు తోడ్పడుతోంది.

# డిగ్రీ చేతిలో.. ఉద్యోగం ఎక్కడ?




చేతిలో చదువు.. కళ్ల ముందు భవిష్యత్తు.. కానీ ఉపాధి లేక ఖాళీగా ఉండే యువత పెరుగుతోంది. తెలంగాణలో 15-29 ఏళ్ల వారిలో చదువు, పని, శిక్షణ.. ఈ మూడింటికీ దూరంగా ఉన్న వారి వాటా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని కార్మిక శక్తి సర్వే గణాంకాలు సూచిస్తున్నాయి. జిల్లాల మధ్య కూడా వ్యత్యాసం ఉంది. కొన్ని చోట్ల ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తోంది. అంటే సమస్య కేవలం ఉద్యోగం దొరకకపోవడమే కాదు.. సరైన మార్గదర్శకత్వం, నైపుణ్య శిక్షణ, అవకాశాల సమాచారం అందకపోవడమూ కారణమే.

### క్రైమ్ పెరగడానికి.. నిరుద్యోగమే కారణమా?

ఏళ్ల తరబడి ప్రభుత్వ నియామక ప్రకటనల కోసం ఎదురుచూసే పట్టభద్రుల్లో నిరాశ పెరగడం సహజం. అది ఒక దశలో ఒంటరి తనం, కుటుంబంపై కోపం, చెడు స్నేహాల వైపు నడిపించే ప్రమాదం ఉంది. 2021లో మహబూబాబాద్ జిల్లాలో ఉద్యోగ ప్రకటన కోసం ఎదురుచూస్తున్న ఓ పట్టభద్రుడి మరణం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే నిరుద్యోగమే ఆత్మహత్యలకు ఏకైక కారణమని చెప్పలేం. కుటుంబ, ఆర్థిక, వ్యక్తిగత ఒత్తిళ్లూ ఉంటాయి. అయినా భవిష్యత్తుపై అనిశ్చితి పెంచే అంశంగా ఉపాధి కొరతను విస్మరించలేం. ముఖ్యంగా యువతులు బయటకు వచ్చి పనిచేయాలన్నా ప్రయాణం, భద్రత, కుటుంబ బాధ్యతలు అడ్డంకులవుతున్నాయి.. వ్యసనాల బారిన పడుతున్న వారినీ విస్మరించలేం. తెలంగాణలో మాదకద్రవ్యాల కేసులు 2023తో పోలిస్తే 2024లో పెరిగినట్లు అధికారిక నేర గణాం కాలు చెబుతున్నాయి. పిల్లలు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో చిక్కుకున్న కేసులూ పెరిగాయి. దొంగతనం, దోపిడీ వంటి ఘటనల్లో బాలలు పట్టుబడుతున్న ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటన్నింటికీ నిరుద్యోగమే ప్రత్యక్ష కారణమని చెప్పడం సరికాదు.. కానీ ఖాళీ సమయం, చెడు స్నేహాలు, వ్యసనాలు, ఆర్థిక ఒత్తిడి, కుటుంబ పర్యవేక్షణ లోపం కలిసి నప్పుడు ప్రమాదం పెరుగుతుంది.

### ప్రభుత్వ కార్యక్రమాలకు... ఉపాధి లెక్కలు ఉండాలి!

ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం, ఉపాధి మేళాలు, ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన, తెలంగాణలో రాజీవ్ యువ వికాసం వంటి కార్య క్రమాలు ఇందుకు ఉద్దేశించినవే. కానీ శిక్షణ పూర్తిచేసిన వారిలో ఎంతమందికి పని లభించింది? ఎంతమంది స్వయం ఉపాధి చేపట్టారు? ఏడాది తర్వాత వారి పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకూ లెక్క ఉండాలి. శిక్షణ పొందిన వారి సంఖ్య కాదు.. దాని తర్వాత నిలిచిన జీవితాలే ఫలితానికి కొలమానం. అలాగే ఏ ఉద్యోగానికి ఏ అర్హత? ఏ నైపుణ్యం నేర్చుకుంటే అవకాశాలు పెరుగుతాయి? శిక్షణ ఎక్కడ? స్థానికంగా ఎక్కడ పని దొరుకుతుంది? అన్నది చాలామందికి తెలియదు.. పట్టణాలకే పరిమితం కాకుండా మండల స్థాయిలోనే ఉపాధి సమాచారం, నైపుణ్య శిక్షణ అందాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణ ఖర్చు, వసతి, భద్రత సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి. మహిళలకు సురక్షిత ప్రయాణం, పని ప్రదేశాల్లో అనుకూల వాతావరణం కల్పించాలి.

### ప్రభుత్వాలే కాదు.. తల్లిదండ్రులు సమాచారమివ్వాలి!

ఈ విషయంలో బాధ్యత ప్రభుత్వానిదొక్కటే కాదు. తల్లిదండ్రులు పిల్లలను నిందించే బదులు వారి మనసు తెలుసుకోవాలి. కళాశాలలు చివరి సంవత్సరం నుంచే వృత్తి మార్గదర్శకత్వం, నైపుణ్య శిక్షణ, ఉపాధి సమాచారాన్ని అందించాలి. పరిశ్రమలు తమకు కావాల్సిన నైపుణ్యాలను విద్యాసంస్థలకు తెలియజేయాలి. ప్రభు త్వం ప్రతి మండలంలో నెలకోసారి ఉపాధి-నైపుణ్య శిబిరాలు నిర్వహించి పని, శిక్షణ, స్వయం ఉపాధి, వ్యసన నిరోధం, అంతర్జాల మోసాలపై అవగాహన కల్పించాలి. అవసరమైన వారికి మానసిక మార్గదర్శక సహాయం అందాలి. డిగ్రీ చేతిలో ఉండటం.. జీవితానికి ఆరంభం కావాలి. చదువుకు తగిన పని, పనికి తగిన ఆదాయం, దానితో ఆత్మవిశ్వాసం రావాలి. లేకపోతే ఖాళీ సమయం చెడు దారులకు చోటిస్తుంది.

# ఫిరాయింపుల నిరోధం.. ఇంకా అసంపూర్తే!



పార్టీ మారడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు.. కానీ ప్రజల తీర్పుతో ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ మారినప్పుడు ఆ తీర్పు విలువ ఏమవుతుందన్న ప్రశ్న మాత్రం ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి ఫిరాయింపుల చట్టం, స్పీకర్ అధికారాలు, ఓటరు తీర్పు పరిరక్షణపై చర్చను ముందుకు తెచ్చింది. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా స్పందిస్తున్న పరిస్థితుల్లో.. ఫిరాయింపుల నిరోధానికి ఉన్న చట్టం నిజంగా తన లక్ష్యాన్ని నెరవేరుస్తోందా? గతంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలలో అనేకం వివిధ సందర్భాల్లో పార్టీ మార్పుల వల్ల ప్రయోజనం పొందాయి. దానం నాగేందర్ విషయానికొస్తే, ఆయన 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేయగా స్పీకర్ తిరస్కరించారు. హైకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేసి ఆయన 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హుడని ప్రకటించింది. ఆ తీర్పును నాగేందర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పునే సమర్థించింది.

### పార్టీ ఫిరాయింపులు ఇప్పటి కథ కాదు..

1967లో హర్యానా ఎమ్మెల్యే గయాలాల్ వరుసగా పార్టీలు మార్చడంతో "ఆయా రామ్, గయా రామ్" అన్న పదబంధం ప్రాచుర్యంలోకి వచ్చింది. 1967-71 మధ్య పార్లమెంటులో 142, రాష్ట్ర శాసనసభల్లో 1,969 ఫిరాయింపులు నమోదయ్యాయి.. 32 ప్రభుత్వాలు కూలిపోయాయి. అందుకే 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చారు. పార్టీ టికెట్‌పై ఎన్నికైన సభ్యుడు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదిలినా, పార్టీ ఆదేశానికి విరుద్ధంగా సభలో ఓటు వేసినా లేదా ఓటింగ్‌కు దూరంగా ఉన్నా అనర్హతకు గురయ్యే నిబంధనలు అందులో ఉన్నాయి. అనర్హతపై నిర్ణయం చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కు అప్పగించారు. అయితే, మొదటి చట్టంలో ఒక రాజకీయ పార్టీ శాసనసభాపక్షంలో చీలిక ఏర్పడి, కనీసం మూడింట ఒక వంతు మంది సభ్యులు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడితే అది "స్ప్లిట్" గా పరిగణించబడి అనర్హత నుంచి రక్షణ ఉండేది. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ఆ మినహాయింపును తొలగించింది. ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనమై, ఆ విలీనానికి శాసనసభాపక్షంలోని కనీసం మూడింట రెండొంతుల మంది అంగీకరించినప్పుడు మాత్రమే పదో షెడ్యూల్ కింద రక్షణ కొనసాగుతుంది.

### పదో షెడ్యూల్ తర్వాత.. కొత్త దారులు..

పదో షెడ్యూల్ అమల్లోకి వచ్చాక, రాజకీయ పక్ష్యాలులు కొత్త మార్గాలు కనుగొన్నాయి. గుంపులుగా పార్టీలు మారడం, విలీనం నిబంధనను ఆశ్రయించడం, రాజీనామాల ద్వారా సభా బలాన్ని మార్చడం జరిగాయి. తెలంగాణలో 2019లో కాంగ్రెస్‌కు చెందిన 18 మంది ఎమ్మెల్యేలలో 12 మంది అప్పటి టీఆర్ఎస్ శాసనసభాపక్షంలో విలీనం కావాలని కోరగా, ఆ సంఖ్య మూడింట రెండొంతులు కావడంతో స్పీకర్ దాన్ని గుర్తించారు.. అప్పుడు కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడంతో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు వెళ్లారు..

### ఇతర రాష్ట్రాల్లోనూ అంతే..!

అరుణాచల్‌ప్రదేశ్‌లో 2016లో ముఖ్యమంత్రి పెమా ఖండూ నాయకత్వంలో 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 43 మంది పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో (పీపీఏ) చేరారు.. అదే ఏడాది చివరికి ఖండూతో పాటు మరో 32 మంది పీపీఏ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో, తాజా శాసనసభ ఎన్నిక లేకుండానే రాష్ట్రంలో పూర్తిస్థాయి బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. కర్ణాటకలో 2019లో 17 మంది కాంగ్రెస్-జేడీఎస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు, రాజీనామాలు హెచ్.డి. కుమారస్వామి ప్రభుత్వ పతనానికి, బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి దోహద పడ్డాయి. సుప్రీంకోర్టు వారి అనర్హతను సమర్థించినప్పటికీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించింది. మధ్యప్రదేశ్‌లో 2020లో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలతో కమల్‌నాథ్ ప్రభుత్వం కూలిపోయింది. ఆ ఎమ్మెల్యేలు తరువాత బీజేపీలో చేరారు..

### అనర్హత అధికారం స్పీకర్‌కు ఉండడంతోనే..

అనర్హతపై తీర్పు చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కే ఉండటం అనేకసార్లు న్యాయ వివాదాలకు దారితీసింది. 2020లో కీశం మేఘచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు, ఈ అధికారాన్ని స్వతంత్ర శాశ్వత ట్రిబ్యునల్‌కు అప్పగించే అంశాన్ని పార్లమెంట్ పరిశీలించాలని సూచించింది. అదే తీర్పులో, అసాధారణ పరిస్థితులు లేకపోతే అనర్హత పిటిషన్లను సాధారణంగా మూడు నెలల్లో నిర్ణయించాలనే కాలపరిమితినీ ప్రస్తావించింది. 2025 జూలై 31న తెలంగాణ కేసుల్లో సుప్రీంకోర్టు మరింత స్పష్టంగా, స్పీకర్ లేదా చైర్మన్‌కే అనర్హత నిర్ణయాధికారాన్ని అప్పగించే ప్రస్తుత వ్యవస్థ ఫిరాయింపులను సమర్థంగా అరికడుతోందా? ప్రజాస్వామ్య పునాదులను కాపాడటానికి అది సరిపోతుందా? అన్నది పార్లమెంట్ పరిశీలించాలని పేర్కొంది. పెండింగ్ పిటిషన్లను మూడు నెలల్లో పరిష్కరించాలని కూడా ఆదేశించింది.

### పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిందే!

ఫిరాయింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో కేంద్రం స్వతంత్ర నిర్ణయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అనర్హత పిటిషన్ల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితిని కూడా నిర్దేశించే అంశంపై పార్లమెంట్ చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలి. దీర్ఘదృష్టితో చూస్తే, ఇది ఏ ఒక్క రాజకీయ పక్షం ప్రయోజనానికీ సంబంధించిన విషయం కాదు.. ప్రజాస్వామ్య విశ్వసనీయతకు, ముఖ్యంగా ఓటరు తీర్పును గౌరవించే వ్యవ స్థకు ఈ ఏర్పాటు అవసరం. ప్రజాప్రతినిధి రాజకీయ అభిప్రా యం మార్చుకునే స్వేచ్ఛను గౌరవిస్తూనే, ఓటరు ఒక పార్టీ అభ్యర్థికి ఇచ్చిన తీర్పు సభలో మరో పార్టీకి సులభంగా బదిలీ కాకుండా చూడాలి. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు ఫిరాయింపులను అరికట్టాలన్న రాజ్యాంగ లక్ష్యం ఇంకా పూర్తిగా నెరవేరాల్సి ఉందని మరోసారి గుర్తు చేసింది.

# ఓటర్ ప్రక్షాళన సరే.. హక్కులకు కోత వద్దు!




ఓటర్ల జాబితాను సమగ్రంగా పునఃపరిశీలించడం ఎన్నికల ప్రక్రియలో అవసరమైనదే. అనర్హుల పేర్లను తొలగించడంతో పాటు, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. అయితే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, అప్పీళ్లకు సులభమైన అవకాశాలు కల్పించి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి. జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించామన్నది కాదు.. అందులో ఉండాల్సిన ప్రతి అర్హుడి పేరు ఎంత భద్రంగా ఉందన్నదే ప్రజాస్వామ్యానికి అసలైన కొలమానం. ఈ ప్రక్రియలో అర్హుడైన ఒక్క పౌరుడి పేరు పొరపాటున తొలగినా, దాన్ని సాధారణ పరిపాలనా లోపంగా చూడలేం.. ఎన్నికల రోజు ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశం పరిమితమవుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల ఎన్నికలు సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా జరుగుతాయి. అర్హత కలిగిన పౌరుడికి ఓటు వినియోగించే అవకాశం ఉండటం ప్రజాస్వామ్య ప్రక్రియకు కీలకం.

### 13 కోట్లకు పైగా ఓటర్ల తొలగింపు..

ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా మూడు దశల్లో 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముసాయిదా జాబితాల నుంచి 13.37 కోట్ల పేర్లు తొలగించబడినట్లు సెప్టెంబర్ 1న వెలువడిన నివేది కలు పేర్కొన్నాయి. ఇది తుది తొలగింపు అని భావించ కూడదు.. ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్ లకు అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఇంత భారీ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు ప్రతి అర్హుడి పేరు సురక్షితంగా ఉందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

### మానవీయ పరిశీలన తప్పనిసరి..

మరణించినవారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలు, శాశ్వతంగా మారినవారి నమోదులను తొలగించడం అవసరమే. కానీ చిరునామా మారిన నగరవాసులు, వలస కార్మికులు, వృద్ధులు, పేద కుటుంబాలు, పత్రాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొనే పౌరుల పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణించాలి. ఒక సాంకేతిక వ్యత్యాసం కనిపించిందని మాత్రమే ఒకరి అర్హతపై అనుమానం ఏర్పడితే, మానవీయ పరిశీలనకు తగిన అవకాశం ఉండాలి. సర్‌పై ప్రతిపక్షాలు పారదర్శకత, నోటీసుల విధానం, పాత జాబితాలతో ప్రస్తుత నమోదులను అనుసంధానించే విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇవి రాజకీయ వాదనలు.. వాటిలోని ప్రతి అంశాన్ని అధికారిక సమాచారం, విచారణ, క్లెయిమ్‌లు, అప్పీళ్ల ఆధారంగా పరిశీలించాలి. కాబట్టి చర్చ ఆరోపణలకే పరిమితం కాకుండా, ఆధారాలు, పరిష్కారాలపై సాగాలి.

### ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పెంచడం..

కేంద్ర ప్రభుత్వం విషయానికొస్తే, సర్‌ను నిర్వహించేది ఎన్నికల సంఘమే. అది రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థ. అందువల్ల ప్రక్రియలో ప్రత్యక్ష పరిపాలనా పాత్ర ఎవరిది? బాధ్యత ఏ స్థాయిలో ఉందన్నది స్పష్టంగా వివరించాలి. అయితే దేశ వ్యాప్తంగా కోట్లాది పేర్లను ప్రభావితం చేసే ప్రక్రియపై ప్రజల్లో సందేహాలు ఏర్పడినప్పుడు, ఓటు హక్కు రక్షణకు అవసరమైన పారదర్శకత, సమాచారం, ప్రజా భరోసాకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇది ఎన్నికల సంఘం స్వతంత్రతను తగ్గించడం కాదు.. ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పెంచడం.

### నోటీసు అందితే అనుమానితుడేనా?

ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత జరిగే క్లెయిమ్‌లు, అభ్యంతరాల దశ అత్యంత కీలకం. పేరు కనిపించకపోయిన పౌరుడు తన పరిస్థితిని తెలుసుకునే విధానం సులభంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సౌక ర్యాలు పరిమితంగా ఉన్నవారికి ప్రత్యామ్నాయ సహాయం అందాలి. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా జీవించే వారు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ప్రక్రియలో వెనుక బడకుండా స్థానిక సిబ్బంది మార్గనిర్దేశం చేయాలి. నోటీసు అందిన ప్రతి వ్యక్తిని ముందుగానే అనుమానితుడిగా చూడకుండా, అతని సమాధానాన్ని నిష్పాక్షికంగా పరిశీలించాలి. ఒకసారి తొలగించిన పేరును తిరిగి చేర్చే నిర్ణయానికి స్పష్టమైన కాలపరిమితి ఉండాలి. తుది జాబితా విడుదలకు ముందు నమోదైన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ప్రజలకు తెలియజేయడం విశ్వాసాన్ని పెంచుతుంది.

### ప్రజాస్వామ్యానికి అసలైన కొలమానం..

సర్ పేరుతో అనర్హుల నమోదులను తొలగించడం అవసరమైతే చేయాలి. కానీ సాంకేతిక లోపం, పత్రాల సమస్య, చిరునామా మార్పు లేదా పరిపాలనా పొరపాటు కారణంగా అర్హుడైన ఒక్క ఓటరు హక్కు కోల్పోకూడదు.. ఓటర్ల జాబితాను పునః పరిశీలించే పేరుతో ప్రజాస్వామ్య హక్కు గల్లంతు కాకూడదు. ఓటు హక్కు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినది కాదు.. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ప్రజాస్వామ్య హక్కు. ఆ హక్కును కాపాడటం ఎన్నికల సంఘం, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మీడియా అందరి సమిష్టి బాధ్యత..అదే ప్రజాస్వామ్య నిబద్ధతకు పరీక్ష.

# మాచర్లలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.. 32 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**29, 30 వార్డుల్లో విస్తృత తనిఖీలు..**

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ మహేశ్వరరావు**



మాచర్ల, అక్టోబర్ 10 (మహి న్యూస్):: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీసులు శనివారం ఉదయం మాచర్లలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి ఆదేశాల మేరకు, గురజాల డీఎస్పీ మహేశ్వరరావు పర్యవేక్షణలో మాచర్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 29, 30 వార్డుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ఆపరేషన్‌లో పోలీసు బృందాలు రౌడీషీటర్లు, పాత కేసుల్లోని



నిందితులు, సమస్యలు సృష్టించే వ్యక్తులకు సంబంధించిన ఇళ్లలో తనిఖీలు నిర్వహించాయి. రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల అనంతరం ఆయా వార్డుల్లో పోలీసులు పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. పాత నేరస్థులు తమ ప్రవర్తనను మార్చుకుని సత్ప్రవర్తనతో జీవించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల టౌన్ సీఐ నజీర్ బేగ్, రూరల్ సీఐ వేణు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

**శాంతియుత ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలి: పోలీసు అధికారులు**



దుర్గి, అక్టోబర్ 10 (మహి న్యూస్):: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దుర్గి మండల పరిధిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కారంపూడి సీఐ ఆవుల భాస్కర్, దుర్గి ఎస్ఐ బి. గోపాల్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఎన్నికల ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలు శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గుర్తిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.

## ఆటోనగర్ లో పర్యటించిన కలెక్టర్, ఎం.ఎల్.ఏ

**ఆటోనగర్ అభివృద్ధికి చర్యలు**



గుంటూరు, మహి న్యూస్ అక్టోబర్ 10 : గుంటూరు ఆటోనగర్ లో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ , గుంటూరు (తూర్పు) శాసన సభ్యులు నసీర్ అహ్మద్ శనివారం పర్యటించారు. ఆటోనగర్లో వసతులు, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి అంశాన్ని



క్షుణ్ణంగా పరిశీలన చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధికి దశలవారీగా చర్యలు చేపడతామని చెప్పారు. రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని అన్నారు. ఆటోనగర్లో పారిశుద్ధ్య పనులు, రహదారుల నిర్మాణం వంటి అవసరాలను గుర్తించామని తెలిపారు. అచ్యుత ఉన్న తుక్కు (స్క్రాప్) మరో ప్రాంతానికి ప్రదేశానికి



తరలించుటకు అవకాశాలు పరిశీలిస్తున్నామని అన్నారు. అదేవిధంగా అవసరం లేని పరికరాలను రోజువారి తరలించుటకు అవకాశాలు ఏ మేరకు ఉన్నాయో గుర్తిస్తామని చెప్పారు. గుంటూరు నగరంలో చక్కటి ఆటోనగర్ ఏర్పాటు జరుగుటకు, అందరి అవసరాలు తీర్చే విధంగా ఉండాలని భావిస్తున్నామని అన్నారు. మంచి ఆటోనగర్ ఏర్పాటు వలన ఉపాధి అవకాశాలు కూడా పెంపొందగలరని ఆశ భావం వ్యక్తం చేశారు. శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ చక్కటి రహదారులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, గుంటూరు నగరపాలక సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్ సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో విస్తృతంగా వాహన తనిఖీలు

**లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాల పరిశీలన**

**డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు**



కర్నూలు, అక్టోబర్ 10: (మహి న్యూస్): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శనివారం కర్నూలు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకేసుల రోడ్డులో, సిరి నోబెల్ ఆసుపత్రి సమీపంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రెండో పట్టణ ఎస్సై శివాంజల్, పోలీసు సిబ్బంది, శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా అనే విషయాన్ని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

# మాదిగలకు మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి కల్పించాలి..

**40 ఏళ్లుగా దక్కని అవకాశం..**

**ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలి:**

**రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిని బరిలోకి దింపుతాం..**

**మాదిగల రాజకీయ చైతన్య వేదిక అల్టిమేటం..**



మాచర్ల అక్టోబర్ 10: (మహి న్యూస్): మాచర్ల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి సుమారు 40 ఏళ్లుగా ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి దక్కకపోవడం బాధాకరమని మాదిగల రాజకీయ చైతన్య వేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం



చేశారు. ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో శనివారం మాచర్ల పట్టణంలోని అంబేద్కర్ పార్కులో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాదిగ రాజకీయ మేధావులు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు వివిధ సామాజిక వర్గాలకు చైర్మన్ పదవికి అవకాశాలు కల్పించినట్లే, మాదిగ సామాజిక వర్గానికి కూడా చైర్మన్ పదవి కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం కాకుండా, మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించాలని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా మాదిగలకు చైర్మన్ పదవి ఇచ్చేవిధంగా రాజకీయ పార్టీలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మాదిగలకు అవకాశం కల్పించని పక్షంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు, అవసరమైతే మాదిగల రాజకీయ చైతన్య వేదిక బలపరచిన స్వతంత్ర అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకుంటామని హెచ్చరించారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ అవకాశాల దిశగా అన్ని పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించాలని మాదిగ రాజకీయ చైతన్య వేదిక ప్రతినిధులు కోరారు. మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప ఉన్నత రాజకీయ పదవులు కల్పించడం లేదన్నారు. మాచర్లలో మాదిగలకు ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని డబ్బులు, మద్యం వంటి ప్రలోభాలతో ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే రాజకీయ పదవులు ఉన్నత స్థానాలు కల్పించే విషయంలో మాత్రం తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్లలో మాదిగ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూస్తున్నారని చైర్మన్ పదవిని శాసించే ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే తమను గుర్తు చేసుకోవడం కాకుండా రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు చొరవ చూపాలని కోరారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వ స్ఫూర్తికి అనుగుణంగా అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. మాదిగ సామాజిక వర్గం కూడా అభివృద్ధి చెందాలని ఉన్నత పదవులను అధిరోహించే అవకాశం పొందాలని ఆకాంక్షించారు. రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకొని మాదిగ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు,గౌరవం, ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు మాచర్ల రూబెన్ మాదిగ, మాచర్ల పట్టణ అధ్యక్షులు బొల్లెద్దుల మరి బాబు మాదిగ, మాజీ మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన యేసోబు, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు పోలేపల్లి అబ్రహం లింకన్, టిడిపి నాయకులు మాచర్ల వాసు పేరువాల పుల్లారావు, కంభంపాటి దానంబాబు, బిజెపి ఆలేటి సామ్యేల్,వైసీపీ నాయకులు వేల్పుల గురవయ్య,అల్లి జీవన్, కందుకూరి మధు,కోట రాజేష్,యలకపాటి రమేష్ బాబు, మాచర్ల హరీష్, మాచర్ల పవన్, బొల్లెద్దుల శివ, బొల్లెద్దుల సంసోను,ఆలేటి యలమంద, బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేయిచేయి కలిపి వర్ధిల్లాలి మాదిగల ఐక్యత, మాదిగలకు చైర్మన్ పదవి కల్పించాలి అంటూ నినాదాలు ఇస్తూ సంఘీభావం తెలిపారు.

# రూ.49.91 లక్షలతో ప్రత్తిపాడు మంచినీటి చెరువు ఆధునికీకరణ

**గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యం**

**– కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

ప్రత్తిపాడు, మహి న్యూస్ అక్టోబర్ 10:ॊ గ్రామాలను పట్టణాలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) 2.0లో



భాగంగా ప్రత్తిపాడు గ్రామంలోని మంచినీటి చెరువు పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, టీడీపీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ పనులకు రూ.49.91 లక్షల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

### చెరువుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, తాను కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి



నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాటర్‌షెడ్ పథకం ద్వారా గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గ్రామస్థులు సాయంత్రం వేళల్లో నడక సాగించేందుకు అనువుగా వెంగళాయపాలెంలోని చెరువును అభివృద్ధి చేసి, దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశామని వివరించారు. ఆ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైందని తెలిపారు. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 100 చెరువులను, గుంటూరు జిల్లాలో 10 చెరువులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు అందించిన నిధులను వినియోగించి అధికారులు చెరువుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సాధ్యమైనంత ఎక్కువగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

### అభివృద్ధికి గుంటూరు పార్లమెంట్‌ను నమూనాగా తీర్చిదిద్దుతున్నాం: వంగవీటి రాధాకృష్ణ

టీడీపీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ, సమర్థవంతమైన నాయకత్వం ఉంటే అభివృద్ధి పనులను ఎలా ముందుకు తీసుకెళ్లవచ్చో పెమ్మసాని చంద్రశేఖర్ నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

### ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం: - ఎమ్మెల్యే రామాంజనేయులు

స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి వెనుకబడిందని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన



సౌకర్యాలను కల్పించేందుకు సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు ముందుకు తీసుకెళ్లగల నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్ అని పేర్కొన్నారు. గతంలో వెంగళాయపాలెం చెరువును అభివృద్ధి చేసి, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారని గుర్తుచేశారు. అదే తరహాలో జిల్లాలో మరిన్ని చెరువులను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొరపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బాబానగర్‌లో ఘనంగా అంబేద్కర్ ధర్మదీక్ష ఉత్సవాలు




### సిద్ధార్థ ట్యూషన్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహణ

తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 10: మండలంలోని సుంకరపాలెం బాబానగర్ గ్రామంలో సిద్ధార్థ ట్యూషన్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవంతో పాటు 70వ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ ధర్మదీక్ష ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు మండలాల నుంచి బౌద్ధులు, దళిత నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి, బౌద్ధ ధర్మ సీనియర్ ఉపాసకులు, రాష్ట్ర దళిత నాయకులు ఏ. రామేశ్వరరావు, దమ్మాచారి పి. నరసింహమూర్తి, రిటైర్డ్ ఆర్ఈఓ నామాడి అప్పారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి. రాంప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధ ధర్మదీక్ష స్వీకరించారని గుర్తుచేశారు. బౌద్ధ ధర్మం బోధించే సమానత్వం, మానవత్వం, కరుణ, నైతిక విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు విద్య, సామాజిక చైతన్యం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు సిద్ధార్థ ట్యూషన్ సెంటర్

గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా సిద్ధార్థ ట్యూషన్ సెంటర్‌ను నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నారు. విద్యార్థుల విద్యా ప్రగతికి తోడ్పడటంతో పాటు వారిలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, ఉన్నత లక్ష్యాల పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ట్యూషన్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని బౌద్ధ ధర్మదీక్ష ఉత్సవాలతో కలిపి నిర్వహించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాశీ రామారావు, కాశీ లక్ష్మణస్వామి, వాకపల్లి అప్పారావు, ఇసుకపట్ల సింహాచలం, నాగబత్తుల బాలకృష్ణ, కుసుమ శ్రీనివాస్, కోరుకొండ రవి, నాగబత్తుల రవిచంద్ర, వాకపల్లి వీరబాబు, ముసల అప్పారావు, వడ్డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. లసిద్ధార్థ ట్యూషన్ సెంటర్ కన్వీనర్లు నాగబత్తుల శ్రీనివాస్, మురళి, సుంకరపాలెం బాబానగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిద్ధార్థ యూత్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తుంబకుప్పం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 10.: చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు, పలమనేరు డీఎస్పీ డి. ప్రభాకర్ ఆధ్వర్యంలో 10-10-2026వ తేదీ శనివారం తెల్లవారిజామున బంగారుపాళ్యం మండలంలోని తుంబకుప్పం గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామభూపాల్, గంగవరం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి, ఖ/ఏ బంగారుపాళ్యం, బంగారుపాళ్యం ఎస్ఐ టి. ప్రసాద్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోని అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేసి, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వంటి నిషేధిత పదార్థాల అక్రమ రవాణా లేదా నిల్వకు సంబంధించిన అంశాలపై తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన సరైన రికార్డులు చూపించని వారి యొక్క మోటార్ సైకిళ్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అక్రమ కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా పోలీసులు ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తారు. ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర అవసరమైన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరడమైనది.



## జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం..

### పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యుడు గోదశి పుండరీష్



ముమ్మిడివరం, మహి న్యూస్, అక్టోబర్ 10: అమలాపురం పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తాననీ గోదశి పుండరీష్ పేర్కొన్నారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానన్నారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తనతో పాటు నియమితులైన సమన్వయ కమిటీ సభ్యులు, నిర్వహక్ దళ్ సభ్యులు, సపోర్ట్ టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మందపల్లి ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్



డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు గోదావరి పుష్కరములు 2027 సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తైలాభిషేక మండప నిర్మాణం మరియు అన్నప్రసాద భావన నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి దేవదాయ ధర్మదాయ శాఖ కమీషనర్ కె. రామచంద్ర మోహన్ దేవస్థానమునకు విచ్చేసి నిర్మాణ పనులు జరుగు స్థలమును పరిశీలించి, దేవదాయ ధర్మదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, కాంట్రాక్టర్ వారికి పనులను మరింత వేగవంతం చేయమని ఆదేశించారు.



**వీరి వెంట. శ్రీ స్వామి వారి సేవలో**

**దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు**

మరియు కార్యనిర్వహణాధికారి. దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు అనగా దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ వేంద్ర త్రినాధరావు, టెక్నికల్ అడ్వైజర్ సుబ్బారావు, ఎస్.ఇ. దుర్గేశ్ కుమార్, డి.ఇ. ఉదయ్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మందపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ సిద్ధంశెట్టి సత్యనారాయణ, మందపల్లి గ్రామం మాజీ సర్పంచ్ చింతం విజయ కృష్ణ మోహన్ రావు మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచాలి

### తిరుపతిలో అవగాహన ర్యాలీ, పోస్టర్ల ఆవిష్కరణ

### టెలి-మానస్ సేవలు ప్రారంభం



తిరుపతి, అక్టోబర్ 10, (మహి న్యూస్): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లాలో ప్రజలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టడంతో పాటు మానసిక ఆరోగ్యంపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి, టెలి-మానస్ సేవలను ప్రారంభించారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, మానసిక ఆరోగ్య నోడల్ అధికారి డాక్టర్ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయక నర్సు మంత్రసానులు (ఏఎన్ఎంలు), ఆశా కార్యకర్తలు, కార్యక్రమ అధికారులు, శ్రీ పద్మావతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్,




కళాశాల సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడం, అవసరమైన సమయంలో నిపుణుల సహాయం తీసుకునేలా ప్రజలను చైతన్యపరచడం ర్యాలీ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

**టెలి-మానస్ సేవలతో మానసిక ఆరోగ్య సహాయం**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, మానసిక ఆరోగ్య నోడల్ అధికారి డాక్టర్ ఉదయ్ కిరణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ కలిసి మానసిక ఆరోగ్య అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం టెలి-మానస్ సేవలను ప్రారంభించారు. ఈ సేవల ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన సలహాలు, మార్గదర్శకత్వం, సహాయం అందుబాటులో ఉంటాయని అధికారులు వివరించారు. మానసిక ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు నిపుణులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మానసిక సమస్యలపై అపోహలు, వివక్ష తొలగించి, ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించడంతో పాటు మానసిక ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### అనుబంధ పట్టికల (అనెక్చర్స్) రూపకల్పన, జనాభా వివరాలు, ఓటర్ల జాబితాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించాలి

### నిర్ణీత గడువులో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి: జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు




తిరుపతి, అక్టోబర్ 10 (మహి న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియను నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల రిజర్వేషన్లకు అవసరమైన జనాభా వివరాలు, ఓటర్ల జాబితాలు, అనుబంధ పట్టికల (అనెక్చర్స్) తయారీ, పరిశీలన



తదితర అంశాలపై సంబంధిత డి పి ఓ సుశీలా దేవి తో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి తిరుపతి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, దేవేందర్ రెడ్డి లు, జెడ్పి డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏం పి డి ఓ లు, జిల్లా పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలయ్యే కాలాన్ని పరిమితం చేసి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి, ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టేలా చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడంతో పాటు, ఆర్థిక సంఘం గ్రాంట్లు సకాలంలో అందేందుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓ) ప్రకారం అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. జీఓ జారీ అయిన అనంతరం నిర్ణీత గడువులోగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి, అవసరమైన గెజిట్ ప్రచురణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్లు రాష్ట్ర స్థాయిలో నిర్ణయించబడతాయని, మిగిలిన నిర్దేశిత పదవులకు సంబంధించిన రిజర్వేషన్లను జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితర స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అవసరమైన అనుబంధ పట్టికలను సంబంధిత అధికారులు ఇప్పటికే సిద్ధం చేస్తున్నారని, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వివరాలతో పాటు మహిళలకు సంబంధించిన రిజర్వేషన్ల పట్టికలను కూడా ప్రత్యేకంగా రూపొందించాలని సూచించారు. వార్డు సభ్యుల రిజర్వేషన్ల కోసం ప్రతి వార్డులో సంబంధిత వర్గాలకు చెందిన జనాభా వివరాలను సేకరించి, వాటిని కేటగిరీల వారీగా అవరోహణ క్రమంలో (అవరోహణ ఆర్డర్) అమర్చాలని తెలిపారు. అధిక జనాభా ఉన్న వార్డులను ముందుగా, తక్కువ జనాభా ఉన్న వార్డులను తరువాత పేర్కొంటూ పట్టికలను రూపొందించాలన్నారు. ఇదే విధంగా సర్పంచ్, ఎంపీటీసీ తదితర స్థానాలకు అవసరమైన అనుబంధ పట్టికలను కూడా నిబంధనలకు అనుగుణంగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన పట్టికలను సంబంధిత అధికారులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఎక్సెల్ షీట్లు, ఇతర వివరాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలానికి సంబంధించిన డేటాను సమగ్రంగా సిద్ధం చేసి, ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. రిజర్వేషన్ల ఖరారులో జనాభా వివరాలు కీలకమైనవని, ప్రస్తుత ప్రక్రియలో వర్తించే ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాల ప్రకారం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన ఓటర్ల వివరాలను సంబంధిత అధికారులు ఇంటింటి పరిశీలన ద్వారా సేకరించి, ఓటర్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), పంచాయతీ కార్యదర్శులు తదితర సిబ్బంది సమన్వయంతో వివరాలను సేకరించడంతో పాటు, గ్రామసభల్లో వివరాలను చదివి వినిపించి, ధ్రువీకరణ అనంతరం సంబంధిత సమాచారాన్ని ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో సేకరించిన వివరాలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులను నిబంధనల మేరకు పరిశీలించి, రిజర్వేషన్ల ప్రక్రియకు అవసరమైన సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు. డీడీఓలు, ఎంపీడీఓలు, తహశీల్దార్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, మండలాల వారీగా సిద్ధం చేసిన అనుబంధ పట్టికలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన వివరాలను



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్పించి, పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రిజర్వేషన్ల ప్రక్రియలో న్యాయపరమైన అంశాలు, అభ్యంతరాలు లేదా ఇతర సందేహాలు ఎదురైతే వాటిని ముందుగానే గుర్తించి, సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల పరిధిలోని స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి, తదుపరి కేటాయింపుల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

# యానాంలో పోలీసుల తనిఖీలు...

### పుదువై కవచం' పేరుతో విస్తృత తనిఖీలు.. నేరాల నియంత్రణే లక్ష్యం

యానాం, మహి న్యూస్, అక్టోబర్ 10: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాత్రివేళ జరిగే దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడంతో పాటు ప్రజలకు భద్రతపై భరోసా కల్పించే లక్ష్యంతో పోలీసులు ప్రత్యేక రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఎస్ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఆదేశాల మేరకు, యానాం ఎస్పీ వరదరాజన్ పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి 'పుదువై కవచం' పేరుతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇటీవలి కాలంలో యానాం పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు, ఇతర నేరాలపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. నేరగాళ్ల కదలికలను ముందుగానే గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచడం, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసుల ఉనికిని పెంచడం వంటి చర్యల్లో భాగంగా ఈ ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సాధారణ పెట్రోలింగ్‌తో పాటు ప్రత్యేక బృందాల ద్వారా రాత్రివేళ తనిఖీలు చేపట్టి పరిస్థితిని పర్యవేక్షించారు.

**అనుమానిత వ్యక్తులు, వాహనాల తనిఖీ**

'పుదువై కవచం' కార్యక్రమంలో భాగంగా రాత్రి వేళల్లో రహదారులపై



సంచరించే అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు తనిఖీ చేశారు. వారి కదలికలు, ప్రయాణానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనుమానం కలిగించే వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. వాహనాల వివరాలను పరిశీలిస్తూ, ఎలాంటి నేరాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి సమయాల్లో అనవసరంగా అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు.

**బార్లు, రెస్టారెంట్లు, లాడ్జీల్లో తనిఖీలు**

యానాం ప్రాంతంలోని బార్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, లాడ్జీల్లోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలిస్తూ, అనుమానాస్పద కదలికలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో నిఘా పెట్టారు. రాత్రివేళల్లో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు, అనుమానాస్పద కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రదేశాలపై దృష్టి సారించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

**నేరాల నివారణకు పటిష్ఠ నిఘా**



ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యమిస్తూ నేరాల నియంత్రణ కోసం పోలీసు శాఖ రాత్రివేళ నిఘాను మరింత పటిష్ఠం చేస్తోంది. నేరాలు జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాకుండా, అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక పెట్రోలింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతర నిఘా ఉంచడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. ప్రత్యేక తనిఖీలతో రాత్రివేళల్లో పోలీసుల కదలికలు పెరగడంతో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై నియంత్రణ ఏర్పడుతుందని, ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తరహా తనిఖీలు పోలీసు శాఖకు కీలకంగా మారాయి.

**ప్రజలకు భద్రతపై భరోసా**

యానాంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం, ప్రజలు నిర్భయంగా రాకపోకలు సాగించేలా చూడడం, రాత్రివేళల్లో జరిగే నేరాలను నియంత్రించడం వంటి లక్ష్యాలతో పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 'పుదువై కవచం' కార్యక్రమం ద్వారా నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా, యానాంలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు శాఖ చేపట్టిన 'పుదువై కవచం' ప్రత్యేక రాత్రి పెట్రోలింగ్ ద్వారా అప్రమత్తతను పెంచి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. ప్రజల భద్రత కోసం రాత్రివేళల్లోనూ నిరంతర నిఘా కొనసాగించడంపై పోలీసు శాఖ దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో సిఐ. డి. సురేష్ బాబు, ఎస్సైలు. పట్టాభి రామయ్య, ఇలాంగో, క్రైమ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ల పరిశీలన, నమోదు

### అక్టోబర్ 12, 13 తేదీల్లో ప్రక్రియ

### గూడూరు, మిడుతూరు, పగిడ్యాల మండలాల బాధితులకు అవకాశం

### కర్నూలులోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో నమోదు




కర్నూలు, అక్టోబర్ 10: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు, నామినీలు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్ల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో బాండ్ల పరిశీలన, నమోదు ప్రక్రియ నిర్వహించనున్నట్లు కర్నూలు సీఐడీ విభాగం అదనపు ఎస్పీ తెలిపారు. కర్నూలు జిల్లా పరిధిలోని గూడూరు, మిడుతూరు మండలాలతో పాటు నంద్యాల జిల్లా పరిధిలోని పగిడ్యాల మండలానికి చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నమోదు ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు నగరంలోని రామలింగేశ్వర నగర్‌లో, ఏపీ టూరిజం హోటల్ సమీపంలోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయ ఆవరణలో జరుగుతుంది. సంబంధిత బాధితులు ఒరిజినల్ బాండ్లు, రసీదులు, చెక్కులను పరిశీలన కోసం తీసుకురావాలి. వాటితో పాటు సంతకం చేసిన కలర్ జిరాక్స్ ప్రతులు, అవసరమైన ఇతర ధ్రువీకరణ పత్రాలను సమర్పించి నమోదు చేయించుకోవాలి.

ముఖ్య గమనిక: ఒరిజినల్ బాండ్లను అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదు. పరిశీలన అనంతరం సమర్పించిన పత్రాల ప్రతులకు ధ్రువీకరణ రసీదు అందజేస్తారు.

# లక్ష్మీపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

### 672 మద్యం బాటిళ్లు స్వాధీనం - ముగ్గురు అరెస్ట్





కర్నూలు, అక్టోబర్ 10: (మహి న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో కర్నూలు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో, కర్నూలు డీఎస్పీ కె. రాఘవేంద్ర పర్యవేక్షణలో, కర్నూలు రూరల్ సర్కిల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురంలో శనివారం తనిఖీలు చేపట్టారు. ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి, కె. నాగలాపురం ఎస్సై అఖిల్, సర్కిల్ సిబ్బంది, శిక్షణలో ఉన్న పోలీస్ కానిస్టేబుళ్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా ఏరుకలి శేఖర్ వద్ద 144, ఏరుకలి తిమ్మయ్య వద్ద 384, ఏరుకలి సురేష్ వద్ద 144 చొప్పున మొత్తం 672 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్ట్ చేసి, వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించేందుకు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.



## గఫూర్ కుటుంబానికి గౌరు చరిత వెంకటరెడ్డి దంపతుల పరామర్శ

### పీవీ కిరణ్ మృతి పట్ల సంతాపం





కర్నూలు, అక్టోబర్ 10: (మహి న్యూస్): కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ కుమారుడు పీవీ కిరణ్ అమెరికాలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి దంపతులు కర్నూలులోని గఫూర్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీవీ కిరణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఏ. సిరి

### అథేనా స్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం తనిఖీ

### ఎన్నికల సామగ్రి పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశం



కర్నూలు, అక్టోబర్ 10: (మహి న్యూస్): త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు నగర శివార్లలోని అథేనా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, సిబ్బంది రాకపోకలు, రిసెప్షన్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల సామగ్రి భద్రపరచడం, పంపిణీ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధులు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## నషా ముక్త భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

నంద్యాల, మహి న్యూస్ అక్టోబర్ 10: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. మేరా యువ భారత్, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో నంద్యాల బ్లాక్ పరిధిలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో "నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ -- నషా ముక్త యువ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, కళాశాల మొదటి సంవత్సరం సమన్వయకర్త డాక్టర్ డి. లెనిన్, వెంకటేశ్వర రెడ్డి, నంద్యాల జిల్లా యువజన అధికారి టి. ఇసయ్య ముఖ్య వక్తలుగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.






### మాదకద్రవ్యాలతో భవిష్యత్తుకు ముప్పు

జిల్లా యువజన అధికారి టి. ఇసయ్య మాట్లాడుతూ, మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకొని వివిధ యువజన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సామాజిక సేవలో ముందుండాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యసనాల వల్ల కుటుంబాల్లో సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు సామాజిక సంబంధాలు దెబ్బతింటాయని వివరించారు. యువత బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, సంబంధిత నేరాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డాక్టర్ డి. లెనిన్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు. యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు.

### వ్యసన బాధితులకు అండగా నిలవాలి

కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యసనాల నివారణ, యువత బాధ్యత, కుటుంబాలు, సమాజంపై వాటి ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు బానిసైన వారిని చిన్నచూపు చూడకుండా, వారికి తగిన చికిత్స, పునరావాసం అందేలా సహకరించాలని వక్తలు సూచించారు. అనంతరం విద్యార్థులు, యువత "నషా ముక్త యువ" ప్రతిజ్ఞ చేశారు. తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తోటి యువతకు అవగాహన కల్పిస్తామని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని సంకల్పించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

నిర్వహణ: మేరా యువ భారత్, నంద్యాల జిల్లా.

సహకారం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలి

### ఎన్నికల నిర్వహణకు 19 అంశాలపై నోడల్ అధికారుల నియామకం

### కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, అక్టోబర్ 10: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురపాలక, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, స్టేషనరీతో పాటు ఇతర ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకోవాలని, రవాణా ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని గుర్తించి, మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు, విధులు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



### 19 అంశాలపై నోడల్ అధికారుల నియామకం

ఎన్నికల నిర్వహణకు సంబంధించి 19 కీలక అంశాలపై నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ బాక్సుల సమీకరణ, పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, సిబ్బంది నియామకం, శిక్షణ, కేంద్రాల ఏర్పాటు, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, రవాణా, మీడియా నిర్వహణ, రోజువారీ నివేదికల సమర్పణ తదితర బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 5,100 వార్డు సభ్యులు, 26 జడ్పీటీసీలు, 432 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికలకు కూడా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవో, డీపీవోలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో కూడా వివాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియపై అభ్యర్థులకు ముందుగానే అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్లకు తెలిపారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీవో భాస్కర్ ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



## అమావాస్య సందర్భంగా బయలువీరభద్రస్వామివారికి విశేష పూజలు

### భక్తులు పరోక్షసేవ ద్వారా పూజల్లో పాల్గొనే అవకాశం

శ్రీశైలం, అక్టోబర్ 10, (మహి న్యూస్):లి అమావాస్యను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్ర పాలకుడైన శ్రీ బయలువీరభద్రస్వామివారికి శనివారం సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రతి మంగళవారం, అమావాస్య రోజుల్లో స్వామివారికి ఈ విశేష పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. అమావాస్య సందర్భంగా భక్తులు పరోక్షసేవ రూపంలో ఈ అర్చనలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.

### పంచామృతాలతో అభిషేకం

పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగేందుకు ముందుగా మహాగణపతి పూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి పంచామృతాలతో పాటు బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహిస్తారు. బయలువీరభద్రస్వామివారిని ఆరాధించడం వల్ల గ్రహదోషాలు తొలగి, అరిష్టాలు నివారించబడి, సర్వకార్యానుకూలత కలుగుతుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నట్లు దేవస్థానం ప్రకటనలో తెలిపింది.

### శ్రీశైలం టీవీ, యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారాలు

పరోక్షసేవలో పాల్గొనే భక్తులకు ప్రసార వివరాలు, సమయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. ఇతర భక్తులు కూడా శ్రీశైలం టీవీ, యూట్యూబ్ ద్వారా పూజా కార్యక్రమాలను వీక్షించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం శ్రీశైల దేవస్థానం సమాచార కేంద్రం ఫోన్ నంబర్లు 83339 01351, 83339 01352, 83339 01353 లను సంప్రదించాలని సూచించారు.

# శ్రీశైలంలో వీణా కచేరి

### నిత్యకళారాధనలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన జి. హవని బృందం సంగీత ప్రదర్శన




శ్రీశైలం, అక్టోబర్ 10, (మహి న్యూస్): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళారాధన వేదికపై శనివారం సాయంత్రం వీణా కచేరి నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన జి. హవని, వారి బృందం ఈ సంగీత కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీణా కచేరీలో భాగంగా వాతాపి గణపతిం, కైలాసగిరి నుంచి, భో శంభో, పంచసప్త రూపిణి, శివ శివ అనరాదా, హిమగిరి తనయా తదితర భక్తి గీతాలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమానికి వరుణ్ మృదంగ సహకారం అందించనున్నారు.

### ప్రాచీన కళల పరిరక్షణే లక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రీ స్వామి అమ్మవార్ల కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

### ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి



నంద్యాల, మహి న్యూస్, అక్టోబర్ 10:లి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని రోల్ అబ్జర్వర్, పునరావాసం మరియు పునరావాస పునఃస్థాపన డైరెక్టర్ ప్రశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. శనివారం బనగానపల్లె, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆమె పర్యటించి, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులతో పాటు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. దరఖాస్తుల్లోని వివరాలు, ధ్రువీకరణకు సమర్పించిన ఆధారాలు, రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ, దరఖాస్తుల స్వీకరణ నుంచి పరిశీలన, ధ్రువీకరణ, పరిష్కారం వరకు ప్రతి దశను ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించిన దరఖాస్తులను అందుబాటులో ఉన్న ఆధారాలతో సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత విధానాలను అనుసరించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణలో గుర్తించిన లోటుపాట్లను తక్షణమే సరిదిద్దాలని, సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌ఓలు) ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక సమస్యలున్న వారిపట్ల వివక్ష చూపొద్దు




కడప, మహి న్యూస్, అక్టోబర్ 10: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రం సహకారంతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటి రెడ్డి సర్కిల్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనలతో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు న్యాయ సేవల పథకం--2024 గురించి వివరించారు. బాధితులకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, వారి హక్కులు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాల పరిష్కారంపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిపట్ల వివక్ష చూపకుండా గౌరవంగా చూడాలని, వారికి కుటుంబ సభ్యులు, సమాజం సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ వేంకట రాముడు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రకాంతమ్మ, వినయ్ కుమార్, కోర్టు సిబ్బంది, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, వైద్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం టికెట్ల కేటాయింపునకు టీడీపీ కట్టుబడి ఉంది: గాజుల ఖాదర్ బాషా



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 10: బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవిస్తూనే, బీసీ రిజర్వేషన్ల కోసం చివరి వరకు న్యాయపోరాటం చేసిందని గాజుల ఖాదర్ బాషా తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ పరంగా 34 శాతానికి పైగా టికెట్లు కేటాయిస్తామని ప్రకటించినట్లు పేర్కొన్నారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నారని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని గాజుల ఖాదర్ బాషా ఆరోపించారు. 16వ ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. బీసీలకు రాజకీయంగా తగిన వాటా కల్పించేందుకు చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. బీసీలకు కేటాయింపుల విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, ఈ అంశంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సాంబశివరెడ్డి, జయరాం రెడ్డి, శివారెడ్డి, వెంకటరమణారెడ్డి, భాస్కర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లలో ఖాళీ స్టాళ్లు, కమర్షియల్ షాపుల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం

### పీలేరు, పుంగనూరు రైతుబజార్లలో అక్టోబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

మదనపల్లి, అక్టోబర్ 10, మహి న్యూస్:లి అన్నమయ్య జిల్లాలోని పీలేరు, పుంగనూరు రైతుబజార్లలో ఖాళీగా ఉన్న స్టాళ్లు, వాణిజ్య దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు టి. త్యాగరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. డ్వాక్రా గ్రూపులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, టోకు, చిల్లర వ్యాపారులు, ఇతర ఆసక్తి గల వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

#### అక్టోబర్ 15 వరకు అవకాశం

దరఖాస్తు ఫారాలను అక్టోబర్ 8 నుంచి 15వ తేదీ వరకు పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీలేరు, పుంగనూరు రైతుబజార్లలో పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారం కోసం రూ.50 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

#### రైతులకు ఉచితంగా స్టాళ్లు

రైతుబజార్లలోని వాణిజ్య దుకాణాలను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు. రైతులకు స్టాళ్లను ఉచితంగా కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 91823 61536 నంబరులో సంబంధిత అధికారిని సంప్రదించాలని జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు టి. త్యాగరాజు సూచించారు.

## శ్రీరవి కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

### 1,300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు..

### 122 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తింపు.




తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 10: లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వీక్స్ ఆఫ్ సర్వీస్' కార్యక్రమంలో భాగంగా శనివారం తాళ్లరేవు మండలం కాపులపాలెం, సుంకరపాలెంలోని శ్రీరవి జూనియర్, డిగ్రీ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో నేత్ర ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు కంటి చూపును పరీక్షించి, అవసరమైన వారికి సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని లయన్స్ ఇంటర్నేషనల్ 316-బి జిల్లా గవర్నర్ లయన్ చిట్నీడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రథమ ఉప గవర్నర్ లయన్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కళాశాలలో చదువుతున్న సుమారు 1,300 మంది విద్యార్థులకు నేత్ర ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు కంటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, చూపులో సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో నిర్వహించిన పరీక్షల్లో 122 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరందరికీ త్వరలో జిల్లా గవర్నర్ లయన్ చిట్నీడి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రథమ ఉప గవర్నర్ లయన్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, జిల్లా ద్వితీయ ఉప గవర్నర్ లయన్ మెట్ట రాధా సరస్వతి, జోన్ చైర్‌పర్సన్ పెద్దిరెడ్డి హేమ వీరవల్లి పాల్గొన్నారు. అలాగే కాపులపాలెం గోల్డ్, యానాం, సుంకరపాలెం, శ్రీరవి క్యాంపస్, కాపులపాలెం మహిళ, గుత్తెనదీవి వేమవరం, యానాం హెరిటేజ్, యానాం కనకాలపేట లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.




# పెద్దల ఆశీర్వాదం నాకు ఎప్పుడూ ఉంది

### బీజేపీలో 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానం..

### పూర్తి సంతృప్తి

### జిల్లా కార్యదర్శి నగళ్ళపాటి శ్రీనివాసులు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 10; భారతీయ జనతా పార్టీలో 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పార్టీ పెద్దల అభిమానాన్ని,



ఆశీర్వాదాన్ని పొందానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పూర్తి సంతృప్తితో ముందుకు సాగుతున్నానని బీజేపీ కడప జిల్లా కార్యదర్శి నగళ్ళపాటి శ్రీనివాసులు తెలిపారు. మహి దినపత్రిక ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ, తన రాజకీయ ప్రయాణంలో పార్టీ నాయకులు అందించిన సహాయ సహకారాలను గుర్తుచేసుకున్నారు. 2013 నుంచి 2015 వరకు అప్పటి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి హయాంలో మైలవరం మండల బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశానని తెలిపారు. అప్పట్లో రాజకీయంగా కొత్త అయినప్పటికీ, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. 2016 నుంచి 2018 వరకు అప్పటి జిల్లా అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో, 2019 నుంచి 2021 వరకు కర్నాటి ఎల్లారెడ్డి నాయకత్వంలో పనిచేశానని వివరించారు. 2022 నుంచి 2023 వరకు మరోసారి వంగల శశిభూషణ్ రెడ్డితో కలిసి పనిచేసినట్లు తెలిపారు. అనంతరం 2024 నుంచి 2025 వరకు జంగిటి వెంకట సుబ్బారెడ్డి నాయకత్వంలో మైలవరం మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. పార్టీ తన సేవలను గుర్తించి, జంగిటి వెంకట సుబ్బారెడ్డి హయాంలోనే జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి, ప్రస్తుత జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి ప్రోత్సాహంతో, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మైలవరం మండలంలో ఆరు సర్పంచ్ స్థానాలు, మూడు ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించామని శ్రీనివాసులు వెల్లడించారు. తన రాజకీయ ప్రస్థానంలో వివిధ హోదాల్లో పనిచేసే అవకాశం కల్పించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదని అన్నారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.









#### జీవితాంతం బీజేపీలోనే కొనసాగుతా

తన జీవితాంతం భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు కృషి చేస్తానని నగళ్ళపాటి శ్రీనివాసులు స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

# ముమ్మిడివరం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐజి అశోక్ కుమార్

ముమ్మిడివరం, మహి న్యూస్, అక్టోబర్ 10: ముమ్మిడివరం సర్కిల్ లో ఉన్న ముమ్మిడివరం, కాట్రేనికోన ఐ పోలవరం పోలీస్ స్టేషన్లు కు సంబంధించి సర్కిల్ ఇన్స్పెక్టర్ ని అడిగి వివరాలు తెలుసుకున్నారు అంతకుముందు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐజీ అశోక్ కుమార్ కు స్వాగతం పలికారు. అనంతరం ముమ్మిడివరం సర్కిల్ పోలీస్ స్టేషన్లో రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఐజి అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లు కు ఫిర్యాదు కోసం వచ్చిన ప్రజల పట్ల స్నేహపూర్వకంగా వారితో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బంది సూచించారు. పోలీస్ స్టేషన్ కార్యాలయంలో రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముమ్మిడివరం సర్కిల్లో ఉన్న ఐపోలవరం ముమ్మిడివరం కాట్రేనికోన పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన విషయాలు సీ ఐ ను తెలుసుకున్నారు. సి ఈ ఆర్ ఐ టెక్నాలజీని ఉపయోగించి దొంగలించబడిన మొబైల్ ఫోన్లు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, మైనర్ పై జరిగే




ఘటన సంబంధించి కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని ముద్దాయిలకు శిక్ష పడేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐజి పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి మత్తుపదార్థాలు మూలాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిటెక్షన్ కిట్స్ ద్వారా నిర్ధారించి మత్తుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని సరైన మార్గంలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముమ్మిడివరం హైవే రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్లు గుర్తించి వాటిని ఇతర డిపార్ట్మెంట్ లతో కలిసి ఆ ప్రాంతాన్ని రేడియం స్టిక్కరింగ్ స్పీడ్ నియంత్రించే అవరోధాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని సమస్యాత్మక అత్యంత సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి పాత ముద్దాయిలను బైండవర్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీనికోసం అవసరమైన ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ముమ్మిడివరం సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసు అధికారులతో ఐజి ముఖాముఖింగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమలాపురం నియోజకవర్గం లోని అల్లవరం మండలం పోలీస్ స్టేషన్ ను ఐజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఫైళ్లను ఐజీ క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అమలాపురం రూరల్ సిఐ డిఎస్పి లను నియోజవర్గ స్టేషన్ లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులంతా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ఎక్కడా ఎటువంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయన వెంట అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ ఆయా సర్కిల్ సిఐలు ఎస్సి సిఐ పుల్లారావు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# శ్రీశైలంలో రేపటి నుంచి దసరా మహోత్సవాలు

### అక్టోబర్ 11 నుంచి 20 వరకు పదకొండు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు

### ప్రతిరోజూ అమ్మవారికి నవదుర్గ అలంకరణలు

### స్వామి, అమ్మవార్లకు వివిధ వాహనసేవలు

### లోకకల్యాణం కోసం సహస్ర చండీ పారాయణ సహిత శతచండీ మహారుద్రయాగం

శ్రీశైలం, అక్టోబర్ 10, (మహి న్యూస్):లి శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను అక్టోబర్ 20వ తేదీ వరకు పదకొండు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు ఉత్సవ విశేషాలను వీక్షించేందుకు గంగాధర మండపం వద్ద ఎల్ఈడీ తెరను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ శ్రీ స్వామివారికి విశేష అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రుద్రయాగం, చండీయాగం, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, స్వామి అమ్మవార్లకు వివిధ వాహనసేవలు, లోకకల్యాణం కోసం జప పారాయణాలు నిర్వహించనున్నారు.



#### నేటి నుంచి ప్రత్యేక పూజలు

అక్టోబర్ 11న ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలోని యాగశాలలో ప్రవేశ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, దీక్షా సంకల్పం, కంకణ పూజ, ఋత్విక్ వరణం, కంకణధారణ నిర్వహిస్తారు. అనంతరం అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధన, చండీ కలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహ జపాలు, చతుర్వేద పారాయణాలు, చండీ సప్తశతి పారాయణం, మహావిద్యా పారాయణం, సూర్యనమస్కారాలు, నవావరణార్చనలు, విశేష కుంకుమార్చనలు, కుమారీ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్వామివారి యాగశాలలో వేదస్వస్తి, శివసంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, చండీశ్వర పూజ, కంకణధారణ, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధన, రుద్రకలశ స్థాపన అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు మధ్యాహ్నకాల అర్చనలు, మహానివేదన సమర్పిస్తారు.

#### లోకకల్యాణం కోసం మహాయాగాలు

ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో భాగంగా సహస్ర చండీ పారాయణ సహిత శతచండీ మహారుద్రయాగాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం, చండీహోమం, అమ్మవారికి నవావరణార్చనలు, కుంకుమార్చనలు జరగనున్నాయి. రాత్రి 9 గంటలకు సువాసినీ పూజ, నీరాజన మంత్రపుష్పాలు, అమ్మవారి ఆస్థానసేవ, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు అమ్మవారికి కాళరాత్రి పూజ జరగనుంది. అక్టోబర్ 19న మహర్నవమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

#### నవదుర్గ అలంకరణలు - వాహనసేవల వివరాలు

తేదీ । అమ్మవారి అలంకారం । వాహనసేవ ।
అక్టోబర్ 11, ఆదివారం । శైలపుత్రి । భృంగి వాహనం ।
అక్టోబర్ 12, సోమవారం । బ్రహ్మచారిణి । మయూర వాహనం ।
అక్టోబర్ 13, మంగళవారం । చంద్రఘంట । రావణ వాహనం ।
అక్టోబర్ 14, బుధవారం । కూష్మాండదుర్గ । కైలాస వాహనం ।
అక్టోబర్ 15, గురువారం । స్కందమాత । శేష వాహనం ।
అక్టోబర్ 16, శుక్రవారం । కాత్యాయని । హంస వాహనం, పుష్పపల్లకీ సేవ ।
అక్టోబర్ 17, శనివారం । కాళరాత్రి । గజ వాహనం ।
అక్టోబర్ 18, ఆదివారం । మహాగౌరి । నంది వాహనం ।
అక్టోబర్ 19, సోమవారం । సిద్ధిదాయిని । కైలాస వాహనం ।
అక్టోబర్ 20, మంగళవారం । శ్రీభ్రమరాంబాదేవి । నంది వాహనం, ఆలయ ఉత్సవం ।

అక్టోబర్ 20న శమీపూజ, తెప్పోత్సవం కూడా నిర్వహించనున్నారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని దేవస్థానం అధికారులు కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com